ఈనాడు
శ్రీకాకుళం
గురువారం అక్టోబరు 17, 2024

డబ్బులిస్తేనే.. దారికొచ్చేది..!

- నత్తనడకన శ్రీకాకుళం- ఆమదాలవలస రోడ్డు పనులు
- ఆరేళ్లుగా ప్రయాణికులకు తప్పని అవస్థలు



వాకలవలస వద్ద కంకర తేలి అసంపూర్తిగా వదిలేసిన రహదారి

– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే కలెక్టరేట్ (శ్రీకాకుళం)

శ్రీకాకుళం- ఆమదాలవలస రహదారి పనులకు మోక్షం లభించట్లేదు. ఆరేళ్ల నుంచి అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతూనే ఉన్నాయి. గత పాలకులు కనీసం దృష్టి సారించకపోవడంతో ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. వందల మంది క్షతగాత్రులయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనుల్లో కదలిక వచ్చినా నత్తనడకన సాగుతున్నాయి. గుత్తేదారుకు రూ.కోట్లలో పేరుకుపోయిన బకాయిల చెల్లింపు జరిగితే తప్ప పనులు పరుగులు పెట్టే పరిస్థితి కనిపించట్లేదు.

తెదేపా ప్రభుత్వం 2018లో రూ.37 కోట్లతో పనులు ప్రారంభించింది. 20 శాతం పూర్తయ్యాక ఎన్నికలు జరిగాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా సర్కారు పనులు కొనసాగించకుండా రీటెండరింగ్‌కు వెళ్లింది. ఆ తర్వాత 24 నెలల గడువుతో మళ్లీ పనులు మొదలుపెట్టారు. అవి 2021 డిసెంబరు నాటికి పూర్తి కావాల్సి ఉన్నా జరగలేదు. అప్పటి వరకు చేపట్టిన రూ.14 కోట్లకు పైగా బకాయిలు ఉండటమే అందుకు కారణం. నాటి నుంచి గుంతలమయంగా మారిన దారిలోనే ప్రయాణికులు అష్టకష్టాలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు.



చింతాడ వద్ద రహదారిపై ప్రమాదకరంగా గుంతలు

అడుగడుగునా కష్టాలే..

★ ఆమదాలవలస నుంచి కొత్త రోడ్డు వరకు మొత్తం ఆరు కల్వర్టులు ఉన్నాయి. వాటి విస్తరణకు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.

★ **వాకలవలస ఆర్టీసీ కాలనీ ఎదురుగా ఏర్పడిన పెద్ద గుంత ప్రమాదకరంగా తయారైంది.**

★ శ్రీకాకుళం నగర పరిధిలోని డే అండ్ నైట్ కూడలి నుంచి కొత్త రోడ్డు వరకు విస్తరణ పనులు ఇంకా మొదలు పెట్టలేదు. వాటికి సంబంధించిన నష్టపరిహారం చెల్లింపులూ జరగాల్సి ఉంది.

★ ఇటీవల పునఃప్రారంభమైన తర్వాత రాగోలులోనే 1.5 కి.మీ. మేర రోడ్డు పనులు చేపట్టారు. ఇంకా కొత్త రోడ్డు నుంచి రాగోలు ప్రారంభం కాకపోవడంతో ఎక్కడికక్కడ గుంతలు వాహన చోదకులకు చుక్కలు చూపిస్తున్నాయి.

రూ.6.50 కోట్లు చెల్లింపు!

కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పనులపై ప్రత్యేక దృష్టి సారించింది. రెండు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్ బకాయిల చెల్లింపుపై గుత్తేదారులకు భరోసా ఇవ్వడంతో పనులు పునఃప్రారంభమయ్యాయి. ఆ మేరకు ఇటీవల ప్రభుత్వం రూ.6.50 కోట్ల మేర బిల్లులు సైతం మంజూరు చేసినట్లు తెలిసింది. ఇంకా రూ.11.50 కోట్ల వరకు రావాల్సి ఉంది. అవి కూడా వీలైనంత త్వరగా వస్తే పనులు వేగవంతమయ్యే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇబ్బందులు తీరుస్తాం..

గుత్తేదారుకు ఇటీవల కొంతమేర బకాయిలు విడుదలయ్యాయి. పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. కల్వర్టులకు సంబంధించి సిమెంటు కావాలని అడిగారు. ఏర్పాటు చేస్తున్నాం. పనులు వెంటనే ప్రారంభమవుతాయి. పూర్తిస్థాయిలో రహదారి పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తీర్చుతాం. సెంటర్ లైటింగ్, మొక్కలు, డ్రైనేజీ పనులు చేయాల్సి ఉంది. నగరంలో విస్తరణ పనులకు సంబంధించి నష్టపోయే వ్యక్తులకు టీడీఆర్ బాండ్లు ఇవ్వాలి. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం.

– స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కలెక్టర్

అమల్లోకి కొత్త మద్యం విధానం..

తొలిరోజు 45 దుకాణాల ఏర్పాటు



నరసన్నపేటలోని పల్లిపేట కూడలిలో కొత్త మద్యం దుకాణం వద్ద వరుస కట్టిన మందుబాబులు

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం: గత వైకాపా సర్కారు తీసుకొచ్చిన ప్రభుత్వ మద్యం విధానానికి ఫుల్‌స్టాప్ పడింది.. తాజాగా కూటమి ప్రభుత్వం తెచ్చిన కొత్త విధానం బుధవారం నుంచి అమల్లోకి వచ్చింది. జిల్లాలో 158 దుకాణాలకు తొలిరోజు 45 తెరుచుకున్నాయి. ప్రొవిజనల్ లైసెన్సులతో వ్యాపారులు అమ్మకాలను ప్రారంభించారు. వీరంతా ఈ నెల 22వ తేదీలోగా పూర్తిస్థాయి లైసెన్సులతో తప్పనిసరిగా తెరిచి విక్రయాలు చేపట్టాల్సి ఉంది. మరోవైపు జిల్లాలో ప్రభుత్వం తరపున ఇప్పటి వరకు నడిచిన 193 దుకాణాలు ఎక్కడికక్కడ మూతపడ్డాయి. వీటిలో ఉన్న సరకును అధికారులు లెక్కలు వేసి డిపోకు తరలించడంలో నిమగ్నమయ్యారు. అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రైవేటు దుకాణదారులకు సరఫరా చేస్తారు. తొలిరోజు నిర్వాహకులు పూర్తిస్థాయిలో దుకాణాలు ఏర్పాటు చేయలేకపోయారు. విక్రయాలు ఎక్కువగా సాగే ప్రాంతాలు, వాస్తు, అనువుగా ఉండేచోట ఎంపిక చేసుకునే పనిలో ఉన్నారు. ఇంకొందరు మంచి ముహూర్తాల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేసినవాటిలో అధికం పాత దుకాణాల్లోనే యథావిధిగా నడుపుతున్నారు.

మరణమే మార్గమని..!

- ★ నిన్న పిల్లలు, నేడు తల్లి మృత్యువాత
- ★ కుముందవానిపేట ఘటన విషాదాంతం

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలం మలగాం పంచాయతీ కుముందవానిపేటలో కుటుంబ కలహాల నేపథ్యంలో శీతల పానీయాల్లో ఎలుకల మందు కలిపి తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన డెక్కాల దుర్గ(30) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. భర్తపై కోపంతో సోమవారం రాత్రి దుర్గ తన ఇద్దరు కుమారులు దుష్యంత్, బాలాజీలకు శీతల పానీయాల్లో ఎలుకల మందు కలిపి తాగించి, తాను ఆత్మహత్యాయత్నం చేసిన సంగతి తెలిసిందే.



డెక్కాల దుర్గ (పాత చిత్రం)

ఈ ఘటనలో ఇద్దరు కుమారులు మంగళవారం మృతి చెందగా, తల్లి పరిస్థితి విషమంగా ఉండటంతో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు దుర్గకు వైద్యం చేసేందుకు ప్రయత్నించినా సహకరించలేదు. దీంతో ఏమీ చేయలేని పరిస్థితి వైద్య సిబ్బందికి తలెత్తింది. పరిస్థితి విషమించడంతో బుధవారం వేకువ జామున మృతి చెందారు.


కుటుంబ కలహాలే కారణమా..

దుర్గ భర్త రాజు శ్రీకాకుళంలో ఓ హోటల్ కుక్‌గా పని చేస్తున్నారు. అతడు దూరంగా ఉండి పట్టించుకోకపోవడంతో జీవితం మీద విరక్తి చెంది ఆమె ఈ నిర్ణయం తీసుకుని ఉంటుందని గ్రామస్థులు భావిస్తున్నారు. దుర్గ కూలి పనులకు వెళ్తూ తన ఇద్దరు కుమారులను పోషించుకుంటూ వస్తోంది. తల్లి, ఇద్దరు పిల్లల మృతదేహాలకు శవ పంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ముగ్గురి మృతదేహాలను చూసి కుముందవానిపేట గ్రామస్థులు, కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు.

అతిథులారా మన్నించండి..!

పర్యాటకుల ప్రాధాన్యతా సందర్శన స్థలాల్లో తెలినీలాపురం విదేశీ పక్షుల విడిది కేంద్రానిది అగ్రస్థానం. జిల్లాకొచ్చే పర్యాటకులు, సందర్శకులు, ప్రకృతి, పక్షి ప్రేమికులకు ఇష్టమైన ప్రాంతం.. కానీ ప్రస్తుతం అక్కడికొచ్చి పరిస్థితులు చూస్తే నిరుత్సాహానికి గురవ్వక తప్పదు. గత ఐదేళ్లు గాలికొదిలేసిన, ఉన్న వ్యవస్థలను నిర్వీర్యం చేసిన అక్కడి వైభవాన్ని, ప్రాభవాన్ని గాడి తప్పించారు గత పాలకులు.. మళ్లీ పూర్వవైభవం రావాలంటే ప్రత్యేక దృష్టి సారించాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులపై ఉంది.

– న్యూస్‌టుడే, టెక్కలి, టెక్కలి పట్టణం



పెయింటెడ్ స్టార్క్ పక్షులు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

పర్యాటక కేంద్రంలోకి వెళ్లే ప్రధాన గేటుకు తాళాలు వేసి మూసేశారు. మరుగుదొడ్ల నిర్వహణ లేక అధ్వానంగా మారాయి. పక్షుల జీవిత చరిత్రను తెలిపే వివరణ కేంద్రం పూర్తిగా మూతపడింది. చిన్న పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట సామగ్రి తుప్పుపట్టి మూలకు చేరింది. కేంద్రం వెనుక భాగం నుంచి ఆకతాయిలు చేరుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సందర్శకులు వెళ్లాలన్నా ఆ మార్గమే వినియోగించాల్సిన పరిస్థితి. జిల్లా మంత్రి అచ్చెన్న సొంత నియోజకవర్గం పర్యాటక కేంద్రం కావడంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కనీసం కన్నెత్తి చూడలేదు..

★ విదేశీ పక్షుల విడిది కేంద్రాన్ని గాలికొదిలేసిన గత ప్రభుత్వం

2014-19 మధ్య తెలినీలాపురం విదేశీ పక్షుల విడిది కేంద్రం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో అడుగులు పడ్డాయి. అప్పటి రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో కార్యాచరణ ప్రారంభమైంది. సైబీరియా నుంచి ఏటా అక్టోబరులో వచ్చే పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ పక్షులు ఇక్కడే పిండోత్పత్తి ప్రక్రియను నిర్వహిస్తాయి. వాటి కిలకిలా రావాలు, హొయలొలికించే విన్యాసాలను ఆస్వాదించేందుకు సందర్శకులు శీతాకాలమంతా ప్రత్యేక ఆసక్తి చూపిస్తారు. వరుసగా సెలవులు, పిక్నిక్‌లు, పర్వదినాలు, పండగలు ఉండటంతో ఈ సమయంలో పెద్దఎత్తున వస్తుంటారు. కేంద్రం అభివృద్ధిలో భాగంగా పగోడాలు నిర్మించారు. పక్షుల చరిత్రను తెలిపేలా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సందర్శకుల కోసం మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం సమకూర్చారు. ప్రాంగణాన్ని శుభ్రంగా తీర్చిదిద్దారు. అత్యాధునిక హంగులతో ముఖద్వారాలు ఏర్పాటుతో పాటు మరిన్ని సౌకర్యాల కల్పనకు ప్రతిపాదించారు. 2018లో వచ్చిన తిత్లీ తుపాను ధాటికి గ్రామంలో పక్షులు సేదతీరే చెట్లన్నీ నేలకొరిగాయి. ఆ సమయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఇనుప స్టాండ్లే నేటికీ దిక్కయ్యాయి. గత ఐదేళ్లలో కనీసం మొక్కలు నాటడం, పక్షుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోలేదు.



నిర్వహణకు నోచుకోని విడిది కేంద్రం



పక్షుల విడిది కేంద్రం ప్రధాన గేటుకు తాళాలు

రక్షణ చర్యలు చేపడతాం

తెలినీలాపురం విడిది కేంద్రానికి రక్షణ గోడ నిర్మాణం, ప్రధాన గేటు ఏర్పాటుకు రూ.12 లక్షలు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం. మరుగుదొడ్ల నిర్వహణకు నిధుల సమస్య ఉంది. పక్షుల చరిత్ర తెలిపే కేంద్రం తాళాలు తప్పనిసరిగా తెరిచి ఉంచేలా సిబ్బందికి సూచిస్తాం. ఇతర సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

– జగదీష్, అటవీశాఖ రేంజ్ అధికారి, టెక్కలి

ఆగండి.. తర్వాత తవ్వుదాం..!

శ్రీకాకుళం అర్బన్, నరసన్నపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నుంచి ఇసుక రేవులను ప్రారంభిస్తామని చెప్పడంతో నిర్మాణదారులు ఇసుక కోసం ఆశగా ఎదురుచూశారు. జిల్లాలో ఎంపిక చేసిన రేవుల్లో తవ్వకాలు ప్రారంభం కాలేదు. నరసన్నపేట మండలం గోపాలపెంట, గార మండలంలో అంబళ్లవలస, బూరవల్లి, శ్రీకాకుళం మండలంలో బట్టేరు, హయతినగరంలో రేవులను



గోపాలపెంటలో ఇసుక రేవు వద్ద ఆర్డీవో ప్రత్యూష, అధికారులు

గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో మాన్యువల్ పద్ధతిలో తవ్వకాలు చేపట్టేందుకు పర్యావరణ అనుమతులను గనులశాఖ ఇచ్చింది. ఇందులో భాగంగా గోపాలపెంట, అంబళ్లవలస, బూరవల్లి రేవులను ఒక సంస్థ, బట్టేరు, హయతినగరం రేవులను వేర్వేరు వ్యక్తులు టెండర్లను దక్కించుకున్నారు. సంబంధిత ప్రక్రియను అధికార యంత్రాంగం పూర్తిచేసింది. వీటిని జిల్లా మంత్రితో ప్రారంభించాలని భావించారు. కానీ ఆయన అందుబాటులో లేకపోవడంతో వాయిదా వేసినట్లు సమాచారం.

ఏర్పాట్లు చేసి వెనక్కి..

నరసన్నపేట మండలం గోపాలపెంటలో ఇసుక రేవును బుధవారం ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ సమక్షంలో ప్రారంభిస్తారని గనులు, రెవెన్యూ అధికారులు స్థలానికి చేరుకొని ఏర్పాట్లు చేశారు. ఇంతలోనే వాయిదా వేసినట్లు ప్రకటించడంతో అధికారులంతా వెనుదిరిగారు. 'కలెక్టర్ అనుమతితో త్వరలో రేవులను ప్రారంభిస్తాం. మరో ఆరింటిని ప్రభుత్వ అనుమతితో ప్రారంభిస్తాం.' అని జిల్లా గనులశాఖ అధికారి మోహనరావు తెలిపారు.

మూడేళ్లవుతున్నా మోక్షం లేదా..?

కొత్తూరు సామాజిక ఆసుపత్రి నూతన భవనం పనులు మూడేళ్ల కిందట రూ.4 కోట్ల వ్యయంతో వైకాపా హయాంలో ప్రారంభించారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో పనులు మధ్యలో నిలిచిపోయాయి. దీంతో ఆసుపత్రికి వచ్చే ప్రజలు, ఉద్యోగులు ఇక్కట్లు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతున్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ ధర్మాన కిశోర్ మాట్లాడుతూ.. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

– న్యూస్‌టుడే, కొత్తూరు



పలాస ఆర్డీవోకు అస్వస్థత



పలాస ఇన్‌ఛార్జి ఆర్డీవో సుదర్శన్‌దొర అస్వస్థతకు గురయ్యారు. కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత ఒక్కసారిగా బల్లపై ముందు వైపు ఒరిగిపోవడంతో ఉద్యోగులు గమనించి సపర్యలు చేశారు. తహసీల్దారు కల్యాణచక్రవర్తి, పలువురు సిబ్బంది హుటాహుటిన కాశీబుగ్గలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వాహనంలో తీసుకొచ్చారు. వైద్యుడు మల్లేశ్వరరావు పరీక్షించారు. న్యూరో సర్జన్ పొందల జగదీష్, పలాస ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ పారినాయుడు ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం 108 వాహనంలో విశాఖపట్నం తరలించారు. – న్యూస్‌టుడే, పలాస

పేదల భూమిపై పెత్తనం..!

- రికార్డుల్లో పేర్లు మార్పు
- వైకాపా హయాంలో రెవెన్యూ మాయాజాలం

అవి జాతీయ రహదారి, బారువ-కొర్లాం రోడ్డు పక్కన భూములు. బహిరంగ విపణిలో ఎకరా రూ.40 లక్షల నుంచి రూ.కోటికి పైగా ఉంటుంది. తాతల కాలం నుంచి సన్న, చిన్నకారు రైతులు సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. రెవెన్యూ మాయాజాలంతో వివాదంలో చిక్కుకున్నాయి. తమ సాగులో ఉన్న భూములకు అడంగల్, ఇతర పత్రాలు మంజూరు చేయాలని రైతులు ఏడాది కాలంగా మొర పెట్టుకుంటున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదు. ప్రభుత్వ పరంగా రాయితీలు, పంట రుణాలు, ఇతర ప్రయోజనాలు కోల్పోతున్నామని అన్నదాతలు వాపోతున్నారు.

– న్యూస్‌టుడే, సోంపేట



బారువ రోడ్డు పక్కన కొర్లాం భూములు

అనేక అనుమానాలు..

బారువ కూడలి నుంచి కొర్లాం జాతీయ రహదారి కూడలి వరకు ఇరువైపులా ఉన్న భూముల్లో విద్యుత్తు ఉపకేంద్రం, నాలుగు దశాబ్దాల కిందట ప్రభుత్వం మంజూరు చేసిన రాజీవ్‌నగర్, హుకుంపేట, పేదల కాలనీలో 160 వరకు కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ సర్వే నంబర్లలోని భూములన్నీ వేరే వ్యక్తి పేరిట నమోదు కావడం చర్చనీయాంశంగా మారింది. ఇనాం భూముల వారసుల వద్ద ఎక్కువ మంది రైతులు 1965 అంతకు ముందుకు కొనుగోలు చేసిన రిజిష్టర్ దస్తావేజులు ఉన్నాయి. ఐదు దశాబ్దాలుగా ఈ భూములకు సంబంధించి అమ్మకాలు, కొనుగోళ్లు, పంట రుణాలు, పంటల బీమా ఇతర లావాదేవీలు రైతుల పేరిట జరిగాయి. భూముల రీసర్వే తర్వాత నుంచి మొత్తం ప్రక్రియ ఆగడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు.

కొర్లాం పంచాయతీ పరిధిలో మూడు ఎకరాల జిరాయితీ చెరువు సహా 49 ఎకరాలు తనకు వారసత్వంగా సంక్రమించాయని రెవెన్యూ హక్కు పత్రాల కోసం దశాబ్దకాలంగా ఒడిశాకు చెందిన ఇనాందారు వారసుడు ప్రయత్నాలు చేస్తున్నారు. చెరువు కింద ఆయకట్టు భూములు ఉండటంతో యథావిధిగా ఉంచాలని రైతులు ఆందోళన చేస్తూ వచ్చారు. ఈ విషయమై న్యాయస్థానాల్లో కేసులు నడిచాయి. మూడు ఎకరాలను విడిచిపెట్టి మిగిలిన భూముల హక్కు పత్రాల కోసం వారసుడు ప్రయత్నాలు సాగిస్తూ వచ్చారు. 2023లో వైకాపా ప్రభుత్వం భూముల రీసర్వే చేపట్టగానే ఆ పార్టీ పెద్దల సాయంతో ఇక్కడ చక్రం తిప్పారు. చెరువు సహా మొత్తం 252 ఎకరాలు స్వాధీనం చేసుకోవడానికి భూమి హక్కు పత్రాలు పొందేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. అప్పటి ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ కావడంతో రీసర్వేలో రైతుల పేర్లకు బదులు పాత రికార్డుల్లోని ఇనాందారు వారసుల పేర్లు నమోదు చేశారు. హక్కుపత్రాలు వస్తే నాలుగోవంతు భూములు ఆ పార్టీ పెద్దలకు అప్పగించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారని సమాచారం.

వెలుగులోకి ఇలా..

ఖరీఫ్ రుణాలు, ఇతర పథకాల కోసం అడంగల్, ఇతర రెవెన్యూ పత్రాలు కావాలని రైతులు దరఖాస్తు చేయడంతో పెద్దల పన్నాగం వెలుగు చూసింది. 2023 వరకు రైతుల పేరిట అడంగల్, ఇతర హక్కు పత్రాలు రాగా రీసర్వే తర్వాత నుంచి వ్యవహారం మారింది. తహసీల్దారు, కలెక్టర్, ఎమ్మెల్యే నుంచి మంత్రుల వరకు వినతి పత్రాలు అందజేసి న్యాయం చేయాలని కోరుతున్నా ఫలితం దక్కలేదు. రికార్డుల్లో రైతుల పేర్లు లేకపోవడంతో ఖరీఫ్ ప్రయోజనాలు కోల్పోయారు.



ఆరు దశాబ్దాల కిందట కొనుగోలు చేశామని పత్రాలు చూపుతున్న రైతులు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు

భూముల రీసర్వే తర్వాత హక్కుదారులకు సంబంధించి వివాదం నెలకొన్నట్లు కనిపిస్తోంది. ఎస్ఎల్ఆర్‌లో మరో వ్యక్తి పేరు ఉంది. 160 మంది వరకు రైతుల వద్ద 212 ఎకరాలకు సంబంధించిన హక్కు పత్రాలు ఉన్నాయి. అప్పట్లో ముఖ్య కార్యదర్శి ఆదేశాల మేరకు భూములను పెండింగ్‌లో ఉంచారు. ప్రస్తుతం పూర్తి వివరాలతో కలెక్టర్, సంయుక్త కలెక్టర్‌కు నివేదిక అందజేస్తాం. పేదల కాలనీ, విద్యుత్తు ఉపకేంద్రం పరంగా ఎటువంటి ఇబ్బందులు ఉండవు. మిగిలిన భూములకు సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– అప్పలస్వామి, తహసీల్దారు, సోంపేట

అడ్డగించి.. కారు ధ్వంసం చేసి..!

● కొట్లాటకు దారి తీసిన ఇసుక వివాదం

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే, నేరవార్తావిభాగం: ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై స్థానికంగా కొందరు వ్యక్తుల మధ్య కొనసాగుతున్న వివాదం కొట్లాటకు దారి తీసింది. దీంతో శ్రీకాకుళం నగరం బలగ కూడలి వద్ద బుధవారం సాయంత్రం ఉద్రిక్తత నెలకొంది. ఆమదాలవలసకు చెందిన సనపల సురేష్‌ను శ్రీకాకుళం గ్రామీణ మండలం రాగోలు వద్ద కొందరు అడ్డుకున్నారు. ఆ సమయంలో ఆయన కారు ఢీకొని పురుషోత్తపురానికి చెందిన సాయి, అశోక్‌లకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. అనంతరం శ్రీకాకుళంవైపు వస్తున్న సురేష్‌ను బలగ కూడలి వద్ద మరికొందరు అడ్డుకోవడంతో గొడవ పెద్దదైంది. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఘర్షణలో సురేష్ కారు అద్దాలు పగలగొట్టి ధ్వంసం చేశారు. దీంతో అరగంట పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సురేష్‌ను రెండో పట్టణ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడి నుంచి వైద్యానికి సర్వజనాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేయలేదని శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.



ఘటనా స్థలంలో పరిస్థితిని అదుపు చేస్తున్న పోలీసులు

కావాలనే దాడి చేశారు..: ఇసుక అక్రమ రవాణాకు అడ్డుపడుతున్నాననే తనపై దాడి జరిగిందని, దీని వెనుక ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్, ఆయన అనుచరులు ఉన్నారని బాధితుడు ఆరోపిస్తున్నారు. కనీసం ఆసుపత్రిలో ఎంఎల్‌సీ కూడా నమోదు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.



రెండో పటణ పోలీసు స్టేషన్‌లో బాధితుడు సురేష్

అంతర్రాష్ట్ర గొలుసు దొంగ అరెస్టు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: మహిళల మెడలోని బంగారు గొలుసులను చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్టు చేశారు. కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 1న ఒకే రోజు నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో పుస్తెలతాళ్లను అపహరించిన కేసుల్లో ప్రధాన నిందితుడిని పట్టుకున్నట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఒడిశాలోని జాజ్పూర్‌కు చెందిన చిన్మయి ప్రధాన్ స్నేహితులు సంతోష్, బిజయ్, సంజయ్‌లతో కలిసి వజ్రపుకొత్తూరు, కాశీబుగ్గ, బారువ, కంచిలి పోలీసుస్టేషన్ల పరిధిలో ఇటీవల చోరీలకు పాల్పడ్డారని వివరించారు. వీరిపై ఒడిశా, పశ్చిమ బెంగాల్, అస్సోం, బిహార్ రాష్ట్రాల్లోనూ గొలుసు దొంగతనం కేసులున్నట్లు చెప్పారు. చిన్మయ ప్రధాన్‌ను అరెస్టు చేశామని, మిగిలినవారు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నిందితుడి నుంచి సుమారు 4.87 లక్షల విలువైన 6.5 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేసును ఛేదించిన అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, కాశీబుగ్గ గ్రామీణ, సోంపేట సీఐలు ఈశ్వరరావు, బి.మంగరాజు, కంచిలి, వజ్రపుకొత్తూరు ఎస్సైలు రాజేష్, నిహార్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, చిత్రంలో పోలీసు అధికారులు

3,071 పనులకు రూ.261 కోట్లు మంజూరు

సారవకోట, న్యూస్‌టుడే: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 3,071 పనులకు రూ.261 కోట్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సారవకోట మండలంలోని అర్లి నుంచి గోవర్ధనపురం వరకు రూ.1.80 కోట్లతో నిర్మించనున్న 2.8 కిలోమీటర్ల బీటీ రోడ్డు, సవరబెజ్జి నుంచి ముంజువానిపేట వరకు రూ.50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుత్తేదారులకు గ్రామస్థులు సహకరిస్తే నెల రోజుల్లో పూర్తవుతాయన్నారు. అర్లి-గోవర్ధనపురం రోడ్డు కోసం స్థలాన్ని ఉచితంగా అందజేసిన జెజ్జి జీవరత్నం, నవిరి అప్పారావులను ఎమ్మెల్యే, కలెక్టర్ అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే రమణమూర్తి మాట్లాడుతూ మండలంలోని సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తానని పేర్కొన్నారు. నియోజవర్గంలోని పలు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కలెక్టర్ రూ.24 కోట్లు మంజూరు చేశారని తెలియజేశారు. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, తెదేపా రాష్ట్ర బీసీ విభాగం అధికార ప్రతినిధి ధర్మాన తేజ్‌కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.



అర్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి,

రాజీకి పిలిచి.. యువకుడిపై చాకుతో దాడి..!

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని దమ్మలవీధిలో బుధవారం దారుణం చోటు చేసుకుంది. ఓ యువకుడిపై చాకుతో దాడి చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధితుడి తల్లి లక్ష్మి, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయకచవితి రోజున దమ్మలవీధికి చెందిన రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. ఆ సమయంలో సుమారు 20 మంది యువకులు పుక్కళ్ల రాము ఇంటికి వచ్చి దాడి చేశారు. గాయాలపాలైన రాము సర్వజనాసుపత్రిలో చికిత్స పొందగా.. అప్పట్లో ఎంఎల్‌సీ కూడా నమోదు చేశారు. ఈ విషయమై రెండు రోజుల కిందట అదే వీధిలో మళ్లీ తగాదా జరిగింది. వీధి పెద్ద మనుషుల సమక్షంలో సమస్య పరిష్కరించుకుందామని రామును పిలిచారు. బుధవారం ఉదయం చర్చలు జరుగుతున్న సమయంలో దుర్గాప్రసాద్ అనే వ్యక్తి రాము మెడపై చాకుతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన రామును హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా.. మొత్తం 18 కుట్లు పడ్డాయి. రాముపై దాడికి పాల్పడిన దుర్గాప్రసాద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటో పట్టణ ఎస్సై హరికృష్ణ తెలిపారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాము

చిన్న ఆలయాలకు పెద్ద సాయం..!

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

ఆదాయం లేని చిన్న ఆలయాలకు ఊరట లభించింది. ధూప, దీప, నైవేద్యాలకు నెలవారీ ఇచ్చే వేతనం రూ.10 వేలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వైకాపా ప్రభుత్వం గత ఐదేళ్ల పాటు ఆలయాల నిర్వహణను కనీసం పట్టించుకోలేదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం కూటమి అధికారంలోకి రాగానే దీనిపై దృష్టి సారించింది. ఇప్పటి వరకు నెలకు రూ.5 వేల చొప్పున అందించే సాయాన్ని పెంచడంపై అర్చకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయం, ఆస్తిపాస్తులు లేని ఆలయాలు చాలా ఉన్నాయి. అలాంటివి కాలక్రమేణా ఆలనాపాలనా లేక నిరాదరణకు గురవుతున్నాయి. వాటిని పునరుద్ధరించేందుకు 2007లో డీడీఎన్(ధూప, దీప, నైవేద్యం) పథకాన్ని ప్రవేశపెట్టారు. అప్పట్లో జిల్లా నుంచి 14 దరఖాస్తులు వెళ్లగా దేవాదాయశాఖ అధికారులు కేవలం ఏడింటిని మాత్రమే ఎంపిక చేశారు. వాటిల్లో ఒక్కో ఆలయానికి ప్రతి నెలా రూ.2,500 చొప్పున ఆర్థిక సాయం అందించేవారు. అందులో అర్చకుల జీవన భృతికి రూ.1,500, మిగతా రూ.1000 ధూపదీప నైవేద్యానికి వినియోగించేవారు.



బొంతలకోడూరు గ్రామంలోని కాశీవిశ్వేశ్వరాలయం

ధూప, దీప, నైవేద్యాలకు ఇకపై రూ. 10 వేలు

రెండు సార్లు పెంపు..

ఆరేళ్ల కిందట తెదేపా హయాంలోనే పథకం ద్వారా ఇచ్చే మొత్తాన్ని రూ.2,500 నుంచి రూ.5 వేలకు పెంచారు. అందులో అర్చకులకు రూ.2,500 ఇచ్చేవారు. మొత్తం 69 ఆలయాలకు సాయం అందేది. అలా పలు విడతలుగా ప్రస్తుతం 139 ఆలయాల్ని ఎంపిక చేసి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. తాజాగా మళ్లీ రూ.10 వేలకు పెంచారు. అర్చకులకు రూ.7 వేలు, ఇతర ఖర్చులకు రూ.3 వేలు చొప్పున కేటాయించారు. ఈ మొత్తాన్ని దేవాదాయశాఖకు చెందిన సర్వశ్రేయోనిధి(సీజీఎఫ్) నుంచి అర్చకుల పేరిట ఉన్న బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. దీంతో చిన్న ఆలయాలపై ఆధారపడి జీవిస్తున్న అర్చకులు ప్రతి నెలా రూ.4 వేలు అదనంగా అందుకోనున్నారు. అర్బన్ ప్రాంతాల్లో ఉండేవాటికి వర్తించదని ఆ శాఖ జిల్లా జిల్లా సహాయ కమిషనర్ బి.ప్రసాద్ పట్నాయక్ స్పష్టం చేశారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం.. డీడీఎన్ పథకంలో భాగంగా జిల్లాలోని 139 ఆలయాలకు అందించే ఆర్థిక సాయం రూ.10 వేలకు పెంచడం ఆనందంగా ఉంది. దీని ద్వారా వాటిపై ఆధారపడి బతుకుతున్న అర్చకులకు మేలు జరుగుతుంది. స్వామి ఆరాధన, అర్చనకు ఎటువంటి ఆటంకం లేకుండా చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయం. ఇలాంటి పథకాలు మరిన్ని అమలు చేయాలని కోరుతున్నాం. – పెంట శ్రీనివాస్ శర్మ, ఉత్తరాంధ్ర అర్చక సంఘం కన్వీనర్

యువకుడిపై పోక్సో కేసు

సారవకోట, న్యూస్‌టుడే: సారవకోట మండలం చిన్నకిట్టాలపాడు పంచాయతీ కురిడింగి గ్రామానికి చెందిన ఓ యువకుడిపై పోలీసులు పోక్సో, అత్యాచారం, అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు సదరు యువకుడితో 2021లో పదో తరగతి చదువుతుండగా పరిచయం ఏర్పడింది. అనంతరం పలుమార్లు కలిసి ప్రేమిస్తున్నట్లు చెప్పాడు. తరచూ ఫోన్లో మాట్లాడేవాడు. మాయమాటలు చెప్పి శారీరకంగా లోబరుచుకున్నాడు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న బాలికను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకువెళ్లగా బాలిక వెళ్లగా గర్భం దాల్చినట్లు తెలిసింది. వెంటనే ఆసుపత్రి వర్గాలు ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించారు. ఉన్నతాధికారుల సమాచారం మేరకు యువకుడిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై బి.అనీల్‌కుమార్ బుధవారం తెలిపారు. కేసును డీపీటీసీ డీఎస్పీ(శ్రీకాకుళం) దర్యాప్తు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ చోదకుడి దుర్మరణం

ఎచ్చెర్ల(లావేరు), న్యూస్‌టుడే: లావేరు మండలం బుడుమూరు వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ చోదకుడు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పొందూరు మండలం నందివాడ పంచాయతీ నరసపురానికి చెందిన ఆవాల సూర్య (50) జాతీయ రహదారిపై గార్డెన్ పనులు చేసేందుకు మహిళలను ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్నారు. బుడుమూరు వద్ద వారిని దించేసి అక్కడే రోడ్డుపై ట్రాక్టర్‌లో కూర్చున్నారు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న ఓ ఆయిల్ ట్యాంకర్ ట్రాక్టర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో సూర్య కింద పడ్డారు. ఆయనపై నుంచి ట్రాక్టర్ వెళ్లటంతో ఘటనా స్థలంలోనే మృతి చెందారు. సూర్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణరావు తెలియజేశారు.



సూర్య(పాత చిత్రం)

వైభవంగా సిరిపూజలు



శ్రీకాకుళం నగరంలో నాగావళి తీరాన ఉన్న బలగ కాలభైరవాలయంలో బుధవారం గౌరీ పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకుడు గణేష్ స్వామి ఆధ్వర్యంలో గౌరీ దేవిని గాజులతో శ్రీచక్ర ఆకారంలో అలంకరించి సిరిపూజలు చేశారు. పరిసర కాలనీలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

20న స.హ.చట్టంపై అవగాహన సదస్సు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలం సింగుపురంలో ఈ నెల 20న ఉదయం 9.30 గంటలకు సమాచార హక్కు చట్టం, గ్రామసభల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉంగటి వెంకటరమణ, కుమిలి రాజేశ్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి జె.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు స్పష్టం చేశారు. స.హ.చట్టంపై ఆసక్తి కలిగినవారు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బస్సు నుంచి జారిపడిన విద్యార్థి

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస-పాలకొండ రహదారిలో ఆమదాలవలస మండలం తాళ్లవలస వద్ద బుధవారం బస్సుల్లోంచి విద్యార్థి జారిపడి గాయపడ్డాడు. విద్యార్థులు తెలిపిన వివరాల మేరకు. . పాలకొండ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న బస్సులో విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. తాళ్లవలస వచ్చేసరికి బస్సు ఫుట్‌బోర్డుపై ఉన్న ఓ విద్యార్థి జారిపడటంతో గాయాలయ్యాయి. వెంటనే అతడిని శ్రీకాకుళం ఆసుపత్రికి తరలించారు. ఘటనతో మిగతా విద్యార్థులు రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. విద్యార్థులకు సరిపడ బస్సులు లేకపోవడంతో రోజూ ఒకే బస్సులో అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రయాణిస్తున్నామన్నారు. అందుకే ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆందోళన చేశారు. దీంతో సుమారు గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. సంబంధిత అధికారులు, పోలీసులు చేరుకుని సమస్యను పరిష్కరించడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.



తాళ్లవలస వద్ద రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

దూసిలో గాంధీ విగ్రహం ఏర్పాటుకు చర్యలు

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: దూసి రైలు నిలయంలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తూర్పుకోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పంకజ్ పరమేశ్వరన్ అన్నారు. ఆమదాలవలస మండలం దూసి రైల్వేస్టేషన్‌ను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం ఇంటాక్ ప్రతినిధులు ఆయనను కలిసి వినతి పత్రం అందించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో గాంధీ దూసి రైల్వేస్టేషన్ సందర్శించారని జీఎంకు వివరించారు. గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసే ప్రదేశాన్ని చూపించినట్లు ఇంటాక్ ప్రతినిధులు తెలిపారు. దూసి రైల్వే స్టేషన్‌ను రైల్వేశాఖ పరంగా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని, ఉద్యమ స్మృతి వనం ఏర్పాటు చేస్తామని జీఎం తెలిపారన్నారు. రైల్వేస్టేషన్‌కు మహాత్మాగాంధీ పేరు పెట్టేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో ఇంటాక్ ప్రతినిధులు వావిలిపల్లి జగన్నాథనాయుడు, కొమ్ము రమణమూర్తి, పొన్నాడ రవికుమార్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.



రైల్వే జీఎం పంకజ్ పరమేశ్వరన్‌తో మాట్లాడుతున్న ఇంటాక్ ప్రతినిధులు

ఖోఖో జట్టు ఎంపికలు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పురుషులు) ఆవరణలో ఆదివారం ఖోఖో జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు చిట్టి నాగభూషణం, సీహెచ్ పాల్గుణరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో జరిగే పోటీలకు డిసెంబరు 21, 2006 తర్వాత పుట్టిన బాలబాలికలు అర్హులని చెప్పారు. ప్రతిభ చూపినవారిని ఈ నెల 25 నుంచి 27 వరకు చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని వివరించారు. మరిన్ని వివరాలకు 94419 14214 నంబరును సంప్రదించాలని సూచించారు.

డెప్యూటేషన్ పోస్టుల్లో అవకాశం కల్పించాలి

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యాపరిశోధన, శిక్షణ సంస్థ(ఎస్‌సీఈఆర్‌టీ)లో డెప్యూటేషన్ ప్రాతిపదికన అధ్యాపక పోస్టుల భర్తీకి జారీ చేసిన ప్రకటనలో అర్హత కలిగిన మున్సిపల్ ఉపాధ్యాయులకు కూడా అవకాశం కల్పించాలని ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య(యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్ కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి డిమాండు చేశారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రకటనలో ప్రభుత్వ, జిల్లా పరిషత్తు యాజమాన్య పరిధిలోని ఉపాధ్యాయులు మాత్రమే అర్హులని పేర్కొనడం సరి కాదన్నారు. తక్షణమే నోటిఫికేషన్‌ను సవరించాలని కోరారు.

రోగులకు సకాలంలో వైద్యం అందించాలి

కొత్తూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలని సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని కురిగాం పీహెచ్‌సీని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే రోగుల విషయంలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించినా సహించేది లేదని స్పష్టం చేశారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం మందులను, దస్త్రాలను పరిశీలించారు. వైద్యాధికారులు సందీప్, ప్రసన్నకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కురిగాం పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	255	275

విభాగినిపై కారు బోల్తా

రణస్థలం మండలం పతివాడపాలెం వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి విభాగినిపై బోల్తాపడింది. ఈ ఘటనలో కారు రోడ్డుపైకి వెళ్లకుండా విభాగినిపై ఉండిపోవటంతో పెను ప్రమాదం తప్పింది. కారు లోపల ఉన్న వ్యక్తులు బయటకు వచ్చేందుకు అవకాశం లేకపోయింది. స్థానికులు వెంటనే గమనించి కారు వద్దకు వెళ్లి సహాయక చర్యలు అందించి వారిని బయటకు తీశారు. ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. – న్యూస్‌టుడే, ఎచ్చెర్ల(రణస్థలం)



స్వయం ఉపాధి శిక్షణ కోర్సుల్లో ప్రవేశాలు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో వచ్చే నెల 1వ తేదీ నుంచి ప్రారంభంకానున్న కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు శిక్షణ కేంద్రం డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణలో ఫొటో అండ్ వీడియోగ్రఫీ, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ కోర్సులు ఉంటాయని, చేరిన వారికి ఉచిత వసతి భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పూర్తి సమాచారం కోసం 95534 10809, 77021 80537 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ

పశువుల లారీ పట్టివేత

కంచిలి, న్యూస్‌టుడే: కంచిలి వద్ద జాతీయ రహదారి పైవంతెన సమీపంలో బుధవారం పశువులను అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. కవిటి మండలం జమేదారుపుట్టుగ గ్రామానికి చెందిన దాసరి చంద్రమణి సమీప ప్రాంతాల్లో పశువులను కొనుగోలు చేసి విక్రయిస్తుంటాడని ఎస్సై జి.రాజేష్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు కబేళాకు తరలిస్తున్న 32 పశువులతో కూడిన లారీని అడ్డుకున్నామని చెప్పారు. అనకాపల్లికి చెందిన డ్రైవర్ కిల్లి సత్యనారాయణ, పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్న చంద్రమణిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

● పథకం అమలుకు 46 గ్రామాల ఎంపిక

ఇక మన దగ్గరే విత్తనోత్పత్తి!

ఖరీఫ్ వరి విత్తనాలకు గతంలో రైతులు ఇబ్బందులు పడేవారు. రోజుల తరబడి దుకాణాల ముందు బారులు తీరి అధిక ధరలు చెల్లించడానికి సిద్ధపడినా అనుకున్న రకాలు రైతులకు లభించేవి కాదు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం గ్రామీణ విత్తనోత్పత్తి పథకానికి శ్రీకారం చుట్టింది. గత వైకాపా ప్రభుత్వం దీన్ని తూతూమంత్రంగా అమలు చేసింది. కూటమి అధికారంలోకి వచ్చాక విత్తనోత్పత్తి పటిష్ఠం చేసేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గ్రామాలను ఎంపిక చేసి విత్తన కొరత లేకుండా చేసేందుకు అడుగులు వేస్తోంది.

న్యూస్‌టుడే, పొందూరు, సరుబుజ్జిలి, కొత్తూరు



సరుబుజ్జిలి మండలం షళంత్రి సచివాలయంలో విత్తనాల బస్తాలతో రైతులు

విత్తనోత్పత్తి పథకం రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 46 గ్రామాల్లో 25 ఎకరాల చొప్పున 1,150 ఎకరాల్లో ఈ పథకం కింద వరి సాగు చేయించాలని నిర్ణయించారు. ఆ మేరకు వచ్చే ఖరీఫ్‌కు 1,150 ఎకరాలకు నాణ్యమైన విత్తనం రైతుల వద్ద లభిస్తుంది. రెండేళ్లలోనే జిల్లాలో పూర్తిస్థాయిలో రైతులే సొంతంగా ఉత్పత్తి చేసే స్థాయికి ఎదుగుతారు. ఏటా రాష్ట్ర విత్తనోత్పత్తి సంస్థ రైతులకు అవసరమైనవి సరఫరా చేస్తోంది. కిలో విత్తనానికి ప్రభుత్వం రూ.10 రాయితీ అందిస్తుంది. రాయితీ మినహా 25 కిలోలు రూ.700 నుంచి రూ.800 వరకు కొంటున్నారు. అయినా అవసరమైన విత్తనం లభించడం లేదు. దీంతో జిల్లాలో అధిక ధరలతో సన్నరకమైన విత్తనాలు రైతులు కొనుగోలు చేయాల్సి వస్తుంది. రైతులు సొంతంగా తయారుచేసుకుంటే బస్తా విత్తనం రూ.400 నుంచి రూ.450 వరకు సిద్ధం చేసుకోవచ్చు.

460 హెక్టార్లలో సాగు..

జిల్లాలో అన్ని పంటల కంటే అధికంగా వరినే సాగు చేస్తున్నారు. ఈ పథకానికి ఎంపిక చేసిన 46 గ్రామాలకు 345 క్వింటాళ్ల విత్తనాలు 460 హెక్టార్లలో సాగు చేసేలా ప్రణాళిక రూపొందించారు. వరిలో మేలైన విత్తనాల తయారీకి చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది ఈ పథకాన్ని వరి పంటకే అమలు చేసింది. గత ప్రభుత్వం ఒక్క వరినే కాకుండా అన్ని రకాల పంటలను ఈ పథకంలో చేర్చి కేవలం విత్తనాలకు రాయితీ ఇవ్వడం మినహా పెద్దగా పట్టించుకోలేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

అన్నదాతలకు శిక్షణ

విత్తన ఉత్పత్తి పథకం విజయవంతం చేయాలని అధికారులు కృషి చేస్తున్నారు. అందుకే విత్తనం ఇవ్వడమే కాకుండా పంట కాలంలో పలు సార్లు రైతులకు శిక్షణ ఇస్తున్నారు. శాస్త్రవేత్తలూ తరచూ పంటలను పరిశీలిస్తారు.

రైతులకు మేలు.. ఎంపిక చేసిన గ్రామాల్లో మూల విత్తనం అందించి రైతులు సొంతంగా తయారుచేసుకునేలా చర్యలు చేపడుతున్నాం. 1,150 ఎకరాల్లో వరి సాగు చేయిస్తున్నాం. తరచూ పర్యవేక్షిస్తున్నాం. విత్తన ఉత్పత్తి ద్వారా ఇతర రైతులకు అందించేలా చర్యలు చేపడుతున్నాం. ఈ పథకంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. – కె.త్రినాథస్వామి, ఇన్‌ఛార్జి జిల్లా వ్యవసాయాధికారి, శ్రీకాకుళం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం	: 9440437129
పలాస	: 8008574279
కవిటి గ్రామీణం	: 8309638875
పలాస గ్రామీణం	: 7386408926
కంచిలి గ్రామీణం	: 9704568738

సమస్య: ఇచ్ఛాపురం పట్టణం ఏఎస్‌పేట కాలనీలో కొన్ని వీధి దీపాలు వెలగక ఇబ్బంది పడుతున్నాం. -పి.పురుషోత్తం, ఇచ్ఛాపురం

సమాధానం: సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. -పి.కామేశ్వరరావు, ఏఈ, ఇచ్ఛాపురం

సమస్య: పలాస మండలం కొత్తపూరు కొత్త వీధిలో కాలువలు లేక ఎక్కడికక్కడ మురుగు నీరు నిలిచిపోతోంది. - స్థానికులు

సమాధానం: త్వరలోనే కాలువలు నిర్మించి సమస్యను పరిష్కరిస్తాం. - మెట్ట వైకుంఠరావు, మండల విస్తరణాధికారి, పలాస

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం, పలాస గ్రామీణం

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

శివారు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచండి



పుర కమిషనర్ రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న జనసేన కార్యకర్తలు

పలాస, న్యూస్‌టుడే: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధి శివారు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని జనసేన కార్యకర్తలు కోరారు. ఈమేరకు పురపాలక కార్యాలయంలో బుధవారం కమిషనర్ ఎన్.రామారావుకు వినతిపత్రం అందజేశారు. గ్రామాల పరిధిలో చెత్త సేకరణ సక్రమంగా చేపట్టకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. వార్డుల్లో డస్ట్ బిన్‌లు ఏర్పాటు చేయాలని.. నిబంధనల మేరకు ప్లాస్టిక్ నిషేధం అమలు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కుక్కల బెడద నుంచి జంట పట్టణాల వాసులను తప్పించాలని కోరారు. జనసేన కార్యకర్తలు కోన కృష్ణారావు, ఎల్.సురేష్, గిరీష్, ఎన్.ధర్మారావు, పి.ఉదయ్‌కుమార్, శ్రీకాంత్, కార్తీక్, కేదార్, దేవా తదితరులు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపులో వివక్ష..!



నిరసన తెలుపుతున్న అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: 'మా వార్డుల్లో సరైన రోడ్లు, కాలువలు లేవు.. కల్వర్టులు ధ్వంసమయ్యాయి. నిధుల కేటాయింపులో వివక్షత చూపడమేంటి?' అని 5, 8 వార్డుల కౌన్సిలర్లు నారాయణ బెహర (తెదేపా), పల్లంటి మధుమూర్తి (వైకాపా) ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని సరిచేసేందుకు నిరహార దీక్ష చేయడానికి సిద్ధమని మధుమూర్తి తీవ్ర స్వరంతో పేర్కొన్నారు. 15వ ఆర్థిక సంఘ నిధులతో వార్డుల్లో చేపట్టబోయే పనులపై చర్చించడానికి బుధవారం పురాధ్యక్షురాలు పిలక రాజలక్ష్మి అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. అజెండాలోని అంశాలను చదువుతుండగానే మధుమూర్తి అభ్యంతరం తెలిపారు. 8వ వార్డును ఎందుకు నిర్లక్ష్యం చేశారని ప్రశ్నించారు. మంగళవారంపేట రోడ్డు దారుణంగా ఉంది. కొత్తది నిర్మించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని నిరసన తెలిపారు. నిధులు కేటాయించే వరకు కదిలబోనని పోడియం ముందు నేలపై కూర్చున్నారు. ఐదో వార్డుకూ అన్యాయం చేశారంటూ నారాయణ బెహర ఆయనకు జత కలిశారు. ఈ నేపథ్యంలో అధ్యక్షురాలు, కమిషనర్‌తో కౌన్సిలర్లకు వాగ్వాదం చోటుచేసుకుంది. వచ్చే నిధుల్లో రూ.10 లక్షలు మంగళవారంపేట రోడ్డుకు కేటాయిస్తామని అధ్యక్షురాలు హామీ ఇవ్వడంతో మధుమూర్తి నిరసన విరమించారు. వార్డులో నెలకొన్న సమస్యలను నారాయణ బెహర కమిషనర్‌కు వినతి రూపంలో అందించారు. నాలుగో వార్డు కౌన్సిలర్ గేదెల శేఖర్, 23వ వార్డు కౌన్సిలర్ ప్రదీప్ పలు సమస్యలు ప్రస్తావించారు. అజెండాలో పేర్కొన్న 15వ ఆర్థిక సంఘం రెండు విడతల నిధుల్లో రూ.48.38 లక్షలతో 9 పనులకు, రూ.53.07 లక్షలతో 13 పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

కాశీబుగ్గ గ్రామీణ సీఐ బాధ్యతల స్వీకరణ



తిరుపతి

కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: కాశీబుగ్గ గ్రామీణ సీఐగా ఎం.తిరుపతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన విశాఖపట్నం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు పని చేసిన ఈశ్వరరావుకు విశాఖకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

సౌర విద్యుత్తు వినియోగంతో సొమ్ము ఆదా

సోంపేట, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకుని విద్యుత్తు బిల్లులను తగ్గించుకోవాలని ట్రాన్స్‌కో ఈఈ జి.ఏగ్నేశ్వరరావు సూచించారు. సోంపేటలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న సోలార్ రూఫ్ టాప్ పథకంపై అవగాహన కల్పించారు. వినియోగదారులు సౌర విద్యుత్తు వినియోగించడం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు.


శునకం.. భయానకం!

• గ్రామాల్లో పెరుగుతున్న కుక్క కాటు బాధితులు

• నియంత్రణ చర్యలు శూన్యం



• చినడోకులపాడు నుంచి రేపల్లెకు ఓ మహిళ కుమార్తెతో వెళ్తుండగా ఆ మార్గంలో తిష్ఠ వేసిన కుక్కలు హఠాత్తుగా దాడి చేశాయి. చిన్నారి గౌను నోటితో పట్టి లాక్కెళ్తుండగా స్థానికులు అప్రమత్తమై రక్షించారు. ఈ ఘటనలో తల్లీకుమార్తెలకు గాయాలయ్యాయి.



• నువ్వలరేవులో ఓ వ్యక్తి నడుచుకుని వెళ్తుండగా కొన్ని శునకాలు వెంటపడ్డాయి. తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ కాళ్లపై కరిచి గాయపరిచాయి.



• అక్కుపల్లిలో ఓ మహిళ ఇంటికి నడుచుకుని వెళ్తుండగా గ్రామ సింహాల గుంపు వెనుక నుంచి వెంటపడింది. నోటితో చీరను వదలకుండా భయభ్రాంతులకు గురి చేసింది. స్థానికులు కేకలు వేయడంతో వదిలేసినా ఆమె కాలిపై కరిచేశాయి.



• చినడోకులపాడు కాలనీలోని ఓ పశువుల శాలలో నాలుగు మేకలు, రెండు ఆవులపై రాత్రి వేళ కుక్కల గుంపు దాడి చేయడంతో మృత్యువాత పడ్డాయి.



• పల్లిసారథి రహదారిలో ఓ వీఆర్వో ద్విచక్ర వాహనంపై కాశీబుగ్గ వైపు నుంచి వస్తుండగా శునకం వెంటపడింది. అదుపు తప్పి కింద పడటంతో గాయాలయ్యాయి.





• డోకులపాడు పంచాయతీ పరిధి సాగర్ కాలనీలో ఇటీవల ఒక మహిళ ఇంటికి వస్తుండగా ఓ గ్రామ సింహం ఆకస్మికంగా వచ్చి చేతి రెండు వేళ్లు కొరికింది. అవి నుజ్జవడంతో పలాస సామాజిక ఆసుపత్రికి తరలించారు. అదే రోజు మరో ముగ్గురిని గాయపరిచింది.

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంతాల్లో శునకాల బెడద అధికంగా ఉంది. కుక్కల బారిన పడి గాయపడుతున్న బాధితుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఇళ్ల నుంచి బయటకు రావడానికి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రహదారులపై ఎక్కడికక్కడ పదుల సంఖ్యలో తిష్ఠ వేసి అటుగా వెళ్లే వారి వెంట పడుతున్నాయి. విద్యార్థులు బడులకు వెళ్లి వచ్చే సమయాల్లో భయంతో వణికిపోతున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని విమర్శలు వస్తున్నాయి.



డోకులపాడు వద్ద రహదారిపై కుక్కల గుంపు

• పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం, వజ్రపుకొత్తూరు, మందస, పలాస మండలాల పరిధిలో నెలకు సుమారు 50 నుంచి 80 మందికి పైగా కుక్క కాటుకు గురవుతున్నారు. బాధితుల్లో ఎక్కువ మంది చిన్నారులు ఉంటున్నారు.

• వజ్రపుకొత్తూరు, డోకులపాడు, చినవంక, బైపల్లి, బాతుపురం, గుణుపల్లి, నగరంపల్లి, బెండి, పెద్దబొడ్డపాడు, పూండి-గోవిందపురం తదితర పంచాయతీల్లో గ్రామసింహాలు స్వైరవిహారం చేస్తున్నాయి. రాత్రి వేళ ఆయా గ్రామాల పరిధిలో ప్రయాణించే వారు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కుక్కలన్నీ ఒకచోట చేరి బిగ్గరగా అరుస్తూ ఆందోళనకు గురి చేస్తున్నాయి.

• మాంసం, చేపలు విక్రయ దుకాణాల నుంచి వచ్చిన వ్యర్థాలు, వివిధ కార్యక్రమాల్లో మిగులు ఆహారాన్ని కుప్పలుగా సమీప పరిసరాల్లో పడేస్తున్నారు. ఆయా ప్రదేశాల్లో కుక్కలు పెద్దఎత్తున తిష్ఠ వేస్తున్నాయి. ఆహారం తింటూ ఆ మార్గంలో వెళ్లే వారి వెంట పడుతున్నాయి. కొందరు తప్పించుకునే క్రమంలో కింద పడి గాయపడటంతో పాటు వాటి బారిన పడుతున్నారు.

టీకా వేస్తున్నాం..

పీహెచ్‌సీ పరిధిలో నెలకు సుమారు 20 మంది వరకు కుక్క కాటు బాధితులు వస్తున్నారు. అందరికీ టీకా అందిస్తున్నాం. రేబిస్‌పై గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. కుక్క కాటుకు గురైతే పీహెచ్‌సీని సంప్రదించాలి. - విజయకుమార్‌రెడ్డి, వైద్యాధికారి, అక్కుపల్లి పీహెచ్‌సీ

నియంత్రణకు చర్యలు తీసుకుంటాం..

గ్రామాల్లో కుక్కల బెడద అధికంగా ఉందని ఫిర్యాదులు అందుతున్నాయి. పశు వైద్యాధికారులతో సంప్రదించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పంచాయతీ కార్యదర్శులతో అవగాహన కల్పిస్తాం. - రమేష్‌నాయుడు, ఎంపీడీవో, వజ్రపుకొత్తూరు

మలుపు..ప్రమాదాలకు పిలుపు

మందస మండలం నారాయణపురం, బహాడపల్లి మధ్య రహదారిలో మలుపులు ప్రమాదాలకు హేతువులుగా మారాయి. పొదలు అల్లుకుని ఉండటంతో దగ్గరకు వచ్చే వరకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల 'మన పలాస-మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా కొన్ని రహదారుల వెంట పొదలు తొలగించారు. ఈ మార్గంలో బెర్మ్‌లు, మలుపుల వద్ద పొదల్ని రెండు రోజుల్లో తొలగించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ డి.దానయ్య తెలిపారు. – న్యూస్‌టుడే, హరిపురం (మందస)



అసంపూర్తి భవనం అక్కరకు వచ్చేనా?



మందస మండలం సువర్ణాపురం క్లస్టరుకు సంబంధించిన రైతు సేవా కేంద్రం నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. బిల్లులు మంజూరు కాక ఏడాది గడిచినా పనుల్లో పురోగతి లేదు. ప్రస్తుతం గ్రామంలోని పాఠశాల పాత భవనంలో రైతు సేవా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇరుకు గది.. పైకప్పు నుంచి వర్షపు నీరు కారుతుండటంతో ఎరువులు, విత్తనాలు నిల్వ చేసినప్పుడు రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీవో సూర్యనారాయణ తెలిపారు. – న్యూస్‌టుడే, మందస

అల్లుకున్న నిర్లక్ష్యం..



కంచిలి మండల పరిధి గొల్లపుట్టుగ బంగారు వీధికి వెళ్లే మార్గంలో విద్యుత్తు తీగలకు పాకుడు జాతి పొదలు అల్లుకోవడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని సమీపంలో ఉన్న వారు భయపడుతున్నారు. ఈ విషయమై ఆ శాఖ ఏఈ గురవయ్యను 'న్యూస్‌టుడే' సంప్రదించగా క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

అధిక బరువు..తప్పని చిక్కులు



వజ్రపుకొత్తూరు మీదుగా నువ్వలరేవు రహదారి కూడలి వైపు బుధవారం ఓ వాహనం సామర్థ్యానికి మించి బరువైన పైపులతో వెళ్తోంది. వాహనానికి వెలుపల కూడా పైపును చక్రంలా కట్టి తీసుకెళ్లడంతో ఇతర వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. ఈ విషయమై పలాస ఎంవీఐ వై.శ్రీనివాసరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా నిబంధనలు అతిక్రమించి సామర్థ్యానికి మించి బరువైన సామగ్రిని తరలిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. –న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

ప్రారంభించారు..తాళాలు వేశారు



కవిటి మండలం నెలవంకలో గ్రామ సచివాలయ భవనాన్ని రూ.40 లక్షలతో నిర్మించారు. సాధారణ ఎన్నికల సమయంలో హడావుడిగా ప్రారంభించారు. తరువాత తాళాలు వేయడంతో సిబ్బంది ఇరుకు గదిలో విధులు నిర్వహించడానికి ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా విద్యుత్తుకు సంబంధించిన పనులు అపరిష్కృతంగా ఉన్నాయని తెలిపారు. అవి పూర్తి కాగానే నూతన భవనంలో విధులు నిర్వహించడానికి ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

మత్స్యకారులకు రాయితీలు అందేలా కృషి



ఇచ్ఛాపురం: కండ్ర వీధి చెరువులో చేప పిల్లల్ని వదులుతున్న అధికారులు, సిబ్బంది

కవిటి, కవిటి గ్రామీణం, ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. కవిటిలో బుధవారం స్వదేశీ మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘాలకు చేప పిల్లలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో మత్స్య సంపద అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. మత్స్యకారులకు రాయితీలు అందేలా చొరవ చూపుతానని స్పష్టం చేశారు. మొత్తం 1,41,800 చేప పిల్లల్ని పంపిణీ చేయగా.. ఇచ్ఛాపురానికి 28,600, కవిటికి 4,200, సోంపేటకు 73,500, పలాసకు 29,700, మందసకు 5,800 కేటాయించారు. తహసీల్దారు ఎం.మురళీమోహన్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎఫ్‌డీవో కె.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యం



కంచిలి మండలం బూరగాంలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్, జడ్పీటీసీ సభ్యురాలు లోలాక్షి, జనసేన నియోజకవర్గ బాధ్యుడు దాసరి రాజు

ఇచ్ఛాపురం గ్రామీణం, కంచిలి, సోంపేట, వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పలువురు నాయకులు పేర్కొన్నారు. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో బుధవారం 'పల్లె పండగ' లో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇచ్ఛాపురం మండలం అరకభద్రలో రూ.30 లక్షలతో 7 సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీపీ బోర పుష్ప, మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు తదితరులు శంకుస్థాపన చేశారు. కంచిలి మండలం బూరగాం, మండపల్లి, కుత్తుమ, కొక్కిలిపుట్టుగ గ్రామాల్లో సీసీ రోడ్లు, పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన నియోజకవర్గ బాధ్యుడు దాసరి రాజు తదితరులు భూమి పూజ చేశారు. సోంపేట మండలం రామకృష్ణాపురంలో తెదేపా మండల అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు తదితరులు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వజ్రపుకొత్తూరు మండలం కంబాలరాయుడుపేటలో రూ.7 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు తెదేపా సీనియర్ నాయకుడు కంబాల దానేసు, యూజీపురంలో పలు అభివృద్ధి పనులకు పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ తదితరులు భూమిపూజ నిర్వహించారు.

కాలువ శుభ్రం..

స్పందనకు వందనం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: పురపాలక సంఘ పరిధి రత్తకన్న ప్రధాన వీధి మార్గంలో వర్షం పడితే రోడ్డుపై మురుగు పారుతోందని 'ఈనాడు' లో ఈ నెల 15న 'కాలువ ఉన్నా.. నిరుపయోగం' శీర్షికతో ప్రచురితమైన కథనంపై పుర కమిషనర్ నల్లి రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.ఉపేంద్రకుమార్ స్పందించారు. మూసుకుపోయిన కాలువను శుభ్రం చేయించి నీరు పారేలా చక్కదిద్దారు. వర్షం పడినా ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

హరిపురం (మందస), న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ అన్నారు. మండల పరిధి హరిపురం, బేతాళపురం, బహాడపల్లి, గుడారిరాజమణిపురం, నారాయణపురం, మందస, కిత్తపల్లి, సొండిపూడి, భైరిసారంగపురం ఉన్నత పాఠశాలలు, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జీవో 117 రద్దు, కామన్ సర్వీసు రూల్స్, నూతన పీఆర్సీ అమలు తదితర సమస్యలపై పోరాడతానని స్పష్టం చేశారు.

డీవైఈవో తనిఖీ

వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం జూనియర్ కళాశాలను బుధవారం జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎస్.తవిటినాయుడు తనిఖీ చేశారు. దస్త్రాలు పరిశీలించారు. ఈ ఏడాది నుంచి కళాశాలను ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహిస్తామని తెలిపారు. అదనపు తరగతులు, సైన్స్ ప్రయోగాలు జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వం నుంచి పాఠ్య, రాత పుస్తకాలు, సంచులు అందజేస్తామన్నారు. త్వరలో అమ్మకు వందనం పథకం అమలులోకి తెస్తామని తెలిపారు. ఆయన వెంట ప్రిన్సిపల్ రమేశ్‌పట్నాయక్, రమణమూర్తి, రూప్‌సుందర్, తిరుపతిరావు ఉన్నారు.

వ్యవసాయ సహాయకులకు శిక్షణ

సోంపేట, న్యూస్‌టుడే: ఖరీఫ్ ధాన్యం నాణ్యతా ప్రమాణాల పరంగా తీసుకోవలసిన జాగ్రత్తలపై సోంపేటలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతు సేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులకు జిల్లా పౌర సరఫరాల సాంకేతిక సిబ్బంది మెలకువలు నేర్పారు. తేమ శాతం కొలవడం, నాణ్యతా ప్రమాణాలను తెలుసుకోవడంపై శిక్షణ ఇచ్చారు. తహసీల్దారు బి.అప్పలస్వామి, ఏవో బి.నర్సింహమూర్తి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో వెంకట్, ఉప తహసీల్దారు పి.కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని వారధి ఫౌండేషన్ తెలుగు రాష్ట్రాల్లో ఆన్‌లైన్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పలాస మండలం బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రోత్సాహక బహుమతి సాధించారు. గత నెలలో జరిగిన పోటీల్లో పదో తరగతి విద్యార్థులు బి.చార్మిల, జి.తనూష, పి.బాలకృష్ణ బృందంగా పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర-2047లో భాగంగా ఈ నెల 1న శ్రీకాకుళంలో నిర్వహించిన జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో అదే పాఠశాల విద్యార్థిని ఎస్.ప్రణతి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. వారిని బుధవారం ఉపాధ్యాయులు అభినందించారు.

రేపు రాష్ట్ర కార్మిక సదస్సు



గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న నాయకులు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ విజయవాడలో ఈ నెల 18న నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు మల్లేశ్వరరావు కోరారు. సదస్సుకు సంబంధించిన గోడప్రతులను కాశీబుగ్గలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను పట్టించుకోవడం లేదని ఆక్షేపించారు. గోపి, భైరాగి, వల్లభరావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు మంజూరు చేస్తే పనులు వేగవంతం



ఆర్డీవో సుదర్శన్ దొరకు వినతిపత్రం అందజేస్తున్న మల్లేశ్వరరావు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: 'మన ఇల్లు.. మన గౌరవం' నినాదంతో గృహ నిర్మాణాలకు ప్రోత్సహిస్తున్నా పలు చోట్ల మౌలిక వసతులు లేక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని గృహ నిర్మాణ సామాజిక చైతన్యకర్త చెన్నూరు మల్లేశ్వరరావు పేర్కొన్నారు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో పలు చోట్ల లబ్ధిదారులతో చర్చించిన అంశాలను బుధవారం పలాస ఆర్డీవో సుదర్శన్‌దొరకు వినతిపత్రం రూపంలో అందజేశానని తెలిపారు. గృహ నిర్మాణానికి లబ్ధిదారులు ఆసక్తిగా ఉన్నారని సదుపాయాలు కల్పించి. బిల్లులు త్వరగా మంజూరు చేస్తే పనులు వేగవంతమవుతాయని వివరించారు. నిర్మాణాలకు మండల, పురపాలక సంఘ స్థాయి అధికారుల సహకారం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

జనసేన జెండా ఆవిష్కరణ

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి పెద్దలక్ష్మీపురంలో బుధవారం జనసేన జెండాను ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దాసరి రాజు ఆవిష్కరించారు. పులకల తులసీరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు తిప్పన దుర్యోధనరెడ్డి, పనాగుల హరి బెహరా, కర్రి నాగరాజు జానీ, భాస్కరరావు, యోగి, మధు, తారకేషు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వసతులు కల్పించండి



దివ్యాంగులు, వృద్ధుల యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న సోంపేట కోర్టు ఆరో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కిషోర్‌బాబు

కంచిలి, సోంపేట, న్యూస్‌టుడే: సోంపేటలోని వెనుకబడిన బాలికల వసతిగృహం, కంచిలి మండలం మండపల్లి పంచాయతీ పరిధిలోని సీతయ్య ఫౌండేషన్ వృద్ధాశ్రమాన్ని బుధవారం సోంపేట కోర్టు ఆరో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కె.కిషోర్‌బాబు తనిఖీ చేశారు. విద్యార్థులు, వృద్ధులతో మాట్లాడి అందుతున్న సదుపాయాలు, ఆహార పదార్థాల నాణ్యత, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహాల పరిసరాలను పరిశీలించారు. మెరుగైన వసతులు కల్పించాలని సూచించారు.

కుళాయి నీరు ఇంకెప్పుడు?

జల్‌జీవన్ మిషన్ లక్ష్యానికి తూట్లు

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే



గురుదాసుపురంలో నీరు రాని కుళాయిలు

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు తీర్చడానికి ఇంటింటికీ కుళాయి నీరందించేందుకు ఉద్దేశించిన జల్‌జీవన్ మిషన్ లక్ష్యం నెరవేరడం లేదు. గత ప్రభుత్వ నిర్వాకంతో గుత్తేదారులకు బిల్లులు మంజూరు కాక పెద్దఎత్తున బకాయిలు పేరుకుపోయాయి. పలాస మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన పనుల్లో వేగం కనిపించడం లేదు. పలు చోట్ల మధ్యలోనే నిలిచిపోగా.. మరికొన్ని గ్రామాల్లో మొదలు కాలేదు. ఫలితంగా పల్లె ప్రజలకు తాగునీటి అవస్థలు తప్పడం లేదు.

• గ్రామాల్లో రక్షిత నీటి పథకాల నిర్మాణం, పైపులైన్లు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేయాలనేది జల్‌జీవన్ మిషన్ ఉద్దేశం. పలాస మండలంలోని 19 పంచాయతీల్లో అరకొర పనులు చేయడంతో కుళాయిల ద్వారా ఇళ్లకు నీరు అందడం లేదు. ఇప్పటివరకు 40 నుంచి 50 శాతం పనులు పూర్తికాని పరిస్థితి. తొలి విడతలో 59 పనులు మంజూరయ్యాయి. సుమారు రూ.9 కోట్లు విడుదల కాగా 53 పనులు జరిగాయి. మూడు పనులకు టెండర్లు పిలవలేదు. రెండో విడతలో 75 పనులకు రూ.25 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు.

ఇదీ పరిస్థితి

వైకాపా ప్రభుత్వం రాష్ట్ర వాటా కింద ఇవ్వాల్సిన 50 శాతం నిధులు ఇవ్వకపోవడంతో పలు చోట్ల ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాలు నిలిచిపోయినట్లు సమాచారం. అవి పూర్తయితే గ్రామాల్లో తాగునీటి సమస్య తీరుతుందని భావించిన ప్రజలకు నిరాశే మిగిలింది. పలాస మండలంలో గురుదాసుపురం, మామిడిమెట్టు, మాకన్నపల్లి, పెదంచల తదితర పంచాయతీల్లో పైపులు వేసినా నీరు రావడం లేదు. మరికొన్ని పంచాయతీల్లో పనులు సగంలోనే ఉన్నాయి. ఇంకొన్ని చోట్ల ఇంకా ప్రారంభించలేదు.

పనులు చేపడతాం..

జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టాల్సిన పనులను సకాలంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం. పలు గ్రామాల్లో ఇంకా కొనసాగుతున్నాయి. త్వరలోనే వాటిని పూర్తి చేసి తాగునీటి అవస్థలు లేకుండా చూస్తాం. – ధనుంజయ, ఏఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, పలాస

వైభవంగా ఘృత యజ్ఞం



ఇచ్ఛాపురం పట్టణ పరిధి పురుషోత్తపురం మహిమా ఆశ్రమంలో అవధూత బాబాల ఆధ్వర్యంలో బుధవారం అలేఖ్ ఆశ్రమ వార్షికోత్సవం, ఘృత యజ్ఞం వైభవంగా నిర్వహించారు. గురువారం పూర్ణాహుతి సమర్పిస్తామని నిర్వాహకులు బ్రహ్మ అవధూత జోగేంద్ర బాబా తెలిపారు. ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా ధర్మాచరణపై బాబాలు అనుగ్రహభాషణం, భజనలు, అన్నప్రసాద వితరణ, సత్సంగం నిర్వహించారు. అలేఖ్ ఆశ్రమ భక్తులు, అవధూత బాబాలు నిరంజన్, జయరాం, ప్రసన్న, ప్రమోద్, ప్రభాస్, దుర్వానందబాబా పాల్గొన్నారు. ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

సమస్య : వంశధార ప్రధాన ఎడమ కాలువ ద్వారా శివారు ప్రాంతాలకు సాగు నీరు అందించాలి. - **బమ్మిడి రాజారావు, రైతు, ఆనందపురం**

సమాధానం : గొట్టబ్యారేజీలో నీటి మట్టం తక్కువగా ఉంది. శివారు ప్రాంతాలకు సాగు నీరు అందిస్తాం.
- **భాస్కరరావు, ఏఈ, వంశధార, నందిగాం**
– న్యూస్‌టుడే, నందిగాం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

బాలికల వసతి గృహాల పరిశీలన

నరసన్నపేట, న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాలను స్థానిక జూనియర్ సివిల్ జడ్జి హరిప్రియ బుధవారం పరిశీలించారు. వసతి గృహాల్లో రక్షణ, మౌలిక వసతులను ఆమె తనిఖీ చేశారు. ఆమెతో పాటు న్యాయవాదులు జి.సత్యనారాయణ, శ్రీలక్ష్మి, సంక్షేమాధికారులు పద్మ, సూర్యప్రభ తదితరులు ఉన్నారు.



బీసీ బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న జడ్జి హరిప్రియ

ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ



ప్రజాదర్బార్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: ఎల్ఎన్‌పేట మండల పరిషత్తు కార్యాలయం వద్ద పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజలు కూడా హాజరయ్యారు. గత అయిదేళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెట్టారు. 15 రోజుల్లో అధికారులు అర్జీదారు వద్దకు వెళ్లి సమస్య పరిస్థితి, పరిష్కారం తదితర విషయాలు తెలియజేయాలని ఎమ్మెల్యే మండల అధికారులకు సూచించారు. ఈ అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్జీల్లో ఫించను అందడం లేదని 125 మంది, గ్రామాల్లో రహదారులు, కాలువలు అధ్వానంగా ఉన్నాయని 28 దరఖాస్తులు, నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కాలేదని తదితర సమస్యలు ఉన్నాయి. ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, తహసీల్దారు జె.ఈశ్వరమ్మ, పోలినాయుడు, కృష్ణమాచార్యులు, కాగాన మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

● అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పేర్కొన్నారు. మండలంలోని చింతలబడవంజ గ్రామంలో ఐసీడీఎస్, ఎన్ఈఆర్‌జీఎస్ నిధులు రూ.7లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, సర్పంచి వూట లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రాజీ పడదగిన కేసులు గుర్తించండి

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: రానున్న డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి బీఎంఆర్ ప్రసన్నలత సూచించారు. న్యాయవాదులతో బుధవారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఇప్పటి నుంచే రాజీ పడదగిన కేసులను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు లకినేని శ్రీనివాసులు, కార్యదర్శి ఉప్పాడ తిరుమలరావు, పూర్వ కార్యదర్శి వెలమల అప్పలనాయుడు, న్యాయవాదులు చింతాడ వెంకటరావు, ఎండ వెంకటరావు, వాన నేతాజీరావు, అర్జునరావు, సంపతిరావు శ్రీధర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



న్యాయవాదులకు సూచనలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి బీఎంఆర్ ప్రసన్నలత

ప్రజలకు పౌష్టికాహారం అందించి, వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి చక్కటి సేవలు అందించడంతో పాటు ప్రీ స్కూలు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించి, ప్రజలకు అన్ని సేవలు అక్కడి నుంచి అందించాల్సి ఉంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న అంగన్‌వాడీలు అద్దె భవనాల్లో కొనసాగడం వల్ల చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు ఇబ్బందులు తప్పడం లేదు. అయినా పాలకులకు పట్టడం లేదు. పాతపట్నం నియోజకవర్గంలోని వీటి పరిస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.



హిరమండలంలో అద్దె భవనంలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

పట్టించుకోని గత పాలకులు

వైకాపా పాలనలో అంగన్‌వాడీలపై దృష్టి సారించలేదు. ఆయా గ్రామాల్లోని ప్రజలు అప్పటి ప్రభుత్వానికి ఎన్నో మార్లు విన్నవించినా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అంగన్‌వాడీల్లోని లబ్ధిదారులు అవస్థలు తీరలేదు. వీరంతా కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. అంగన్‌వాడీలకు సొంత భవనాల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అద్దె భవనాల్లోనే అంగన్‌వాడీలు!

అవస్థల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు

న్యూస్‌టుడే, కొత్తూరు హిరమండలం, పాతపట్నం

పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట, మెళియాపుట్టి, పాతపట్నం మండలాల్లో 455 ప్రధాన, మినీ అంగన్‌వాడీ కేంద్రాలకు లబ్ధిదారులకు సేవలందుతున్నాయి. ఇందులో కేవలం 190 చోట్ల మాత్రమే సొంత భవనాలను సమకూర్చారు. మిగతా 186 కేంద్రాలను అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. మరో 79 భవనాల్లో అద్దె లేకుండా నిర్వహిస్తున్నారు. గాలి, వెలుతురు సరిగ్గా లేని ఇరుకు గదుల్లో కొన్ని చోట్ల కేంద్రాలు నిర్వహిస్తుండటంతో కార్యకర్తలు, లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. కొన్ని చోట్ల నీటి సదుపాయం, మరుగుదొడ్లు, విద్యుత్తు వంటివి లేవు. దీంతో కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తూరు మండలంలోని మెట్టూరు బిట్-2 పంచాయతీలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలను కలిపి ఒకే చోట నిర్వహిస్తుండటం గమనార్హం.

మండలాల్లో పరిస్థితి

మండలం	పంచాయతీలు	అంగన్‌వాడీ కేంద్రాలు (మినీలతో కలిపి)	అద్దె భవనాల్లో ఉన్నవి	అద్దె లేనివి
కొత్తూరు	43	104	40	17
హిరమండలం	25	82	44	15
ఎల్ఎన్‌పేట	19	61	16	21
పాతపట్నం	34	100	54	17
మెళియాపుట్టి	37	108	32	9

ఇరుకు గదులతో ఇక్కట్లు.. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలను నిర్మించాలి. పలు చోట్ల ఇరుకు గదుల్లో, మౌలిక సదుపాయాలు లేని చోట్ల ఇవి నిర్వహించడంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనిపై పాలకులు స్పందించాలి.
– సిర్ల ప్రసాదరావు, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు, కొత్తూరు

పూర్తిస్థాయిలో భవనాలు నిర్మిస్తాం.. అంగన్‌వాడీ కేంద్రాలను గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. అయిదు మండలాల్లో 70 చోట్ల మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.36 వేల చొప్పున, 65 చోట్ల నీటి ట్యాంకుల నిర్మాణానికి రూ.17 వేల చొప్పున రెండింటికి కలిపి రూ.36.60 లక్షల నిధులు విడుదల చేశాం. అంగన్‌వాడీ కేంద్రాలకు పూర్తిస్థాయిలో సొంత భవనాల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. లబ్ధిదారులు, అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెడతాం.
– మామిడి గోవిందరావు, ఎమ్మెల్యే, పాతపట్నం

49ఆర్ కాలువకు గండి

వంశధార 49ఆర్ కాలువకు గండి పడింది. మోదుగువలస పైభాగంలో గండి పడటంతో కింది ప్రాంతానికి సాగునీటి సరఫరా నిలిచిపోయింది. ప్రస్తుతం పంటలన్నీ పొట్టదశలో ఉండటంతో నీరు లేక పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 2 వేల ఎకరాల ఆయకట్టుపై సాగునీటి సమస్య ప్రభావం పడుతోంది. ఈ విషయమై వంశధార ఈఈ శేఖరరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా గండి పూడ్చివేతకు చర్యలు చేపట్టి రైతులకు సమస్య లేకుండా చూస్తామన్నారు.
– న్యూస్‌టుడే, టెక్కలి



కుళాయి చుట్టూ నాచుతో ఇక్కట్లు

కొత్తూరు మండలంలోని కొత్త పొన్నుటూరు గ్రామంలో తాగునీటి కుళాయి చుట్టూ నాచు చేరింది. దీంతో ఈ నీరు బిందెలతో పట్టుకునే సమయంలో జారి పోతున్నారు. కొన్నిమార్లు నీరు కలుషితమవుతుందని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యపై గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి, తగిన చర్యలు చేపట్టాలని పొన్నుటూరు గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఏఈ మణికంఠ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా వెంటనే కుళాయి వద్ద నాచును తొలగించి, పరిసరాలను శుభ్రపరుస్తామన్నారు.
– న్యూస్‌టుడే, కొత్తూరు



మురుగునీరు తొలగింపు

స్పందనకు వందనం



నరసన్నపేటలోని గోపాలపెంట ప్రధాన రహదారిపై నిలిచిన మురుగునీటిని యుద్ధప్రాతిపదికన తొలగించారు. 'మురుగుపోయే మార్గమేదీ' శీర్షికతో 'ఈనాడు'లో బుధవారం ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ జావెద్ స్పందించి హుటాహుటిన మురుగునీటిని తొలగించారు. గోపాలపెంట ప్రధాన రహదారిపై కొద్ది రోజులుగా మురుగునీరు నిలిచి అవస్థలు పడుతున్నారు. సమస్యకు పరిష్కారం కావడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
– న్యూస్‌టుడే, నరసన్నపేట

క్షేత్ర సహాయకురాలిపై విచారణ

నరసన్నపేట, న్యూస్‌టుడే: గోపాలపెంట ఉపాధి క్షేత్ర సహాయకురాలిపై బుధవారం అధికారులు విచారణ చేపట్టారు. పనుల నిర్వహణ, వేతనదారుల హాజరు వంటి ఫిర్యాదుల నేపథ్యంలో డ్వామా అధికారులు గోపాలపెంట సచివాలయంలో విచారణ నిర్వహించారు. ఫీల్డు అసిస్టెంట్ బి.ప్రియాంకకు అనుకూలంగా, వ్యతిరేకంగా పరస్పరం వాదనలతో కొద్ది సేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎస్సై దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకొని పరిస్థితిని అదుపు చేశారు. డ్వామా ఏపీడీ లోకేష్ ఆధ్వర్యంలో జరిగిన విచారణలో ఏపీవో యుగంధర్, సర్పంచి కృష్ణవేణి, ఎంపీటీసీ సభ్యుడు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



విచారణ నిర్వహిస్తున్న అధికారులు

రహదారి పనులకు భూమి పూజ

వంశధార, రెవెన్యూ సంయుక్త సర్వేల నేపథ్యంలో ఆక్రమణల తొలగింపు తరువాత పల్లె పండుగ కార్యక్రమంలో రహదారి పనులకు శ్రీజగన్నాథపురం పంచాయతీలో భూమి పూజలు నిర్వహించారు. ఇక్కడి నుంచి సచివాలయానికి వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం కానుంది.-న్యూస్‌టుడే, కోటబొమ్మాళి



సంక్షిప్త సమాచారం

విద్యా ప్రగతికి ప్రోత్సాహం

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలం పెద్ద సీది జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థికి నగదు బహుమతిని అందించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన రేగేటి అశ్వినికి కొరసవాడకు చెందిన చేనేత వ్యాపారవేత్త మంచు కృష్ణారావు రూ.5 వేల నగదు బహుమతి, జ్ఞాపికను అందించారు. ప్రధానోపాధ్యాయుడు బి.రామమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్య పరిరక్షణ

హిరమండలం, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన ఉత్పత్తులు తినడం వల్ల ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని కొత్తూరు సీడీపీవో విమలకుమారి అన్నారు. బుధవారం హిరమండలం సెక్టారు పరిధిలోని ఐసీడీఎస్ ఉద్యోగులు, రైతులు, తల్లులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎం.భవాని, శ్రీరాములు, లలిత, రాములమ్మ, వెంకటరత్నం, సాయి కుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

జలుమూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దారు జె.రామారావు అన్నారు. మండలంలోని తలతరియా పంచాయతీ ఎర్రన్నపేటలో సర్వే నంబరు 29లో ప్రభుత్వ గోర్జెను ఆక్రమించి సోలార్ పలకలను గోవిందరావు అనే వ్యక్తి అమర్చడంతో వాటిని రెవెన్యూ సిబ్బంది బుధవారం తొలగించారు. ఆర్ఐ కిరణ్, మండల సర్వేయరు టి.నాగేశ్వరరావు, పలువురు వీఆర్వోలు, గ్రామ సహాయకులు పాల్గొన్నారు.



స్థల పరిశీలన


కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: అన్నక్యాంటీన్ నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని బుధవారం తహసీల్దార్ అప్పలరాజు, వీఆర్వోలు పరిశీలించారు. కోటబొమ్మాళి-సంతబొమ్మాళి మెయిన్ రోడ్డులో తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా సర్వే నంబరు 268/01లో ప్రభుత్వ స్థలాన్ని వీఆర్వోలు అఖిల్, రంగస్వామిలతో కలిసి పరిశీలించారు. ● అదేవిధంగా జాతీయ రహదారిపై తర్లిపేటలో సర్వే నంబరు 36/01లో వేద విశ్వవిద్యాలయానికి మంజూరైన భూముల హద్దులను రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు పరిశీలించారు. వీఆర్వో రాము తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

హిరమండలం న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ పోలీసు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై మహమ్మద్ యాసిన్ అన్నారు. బుధవారం సుభలయ ఆర్ఆర్ కాలనీలో ప్రజలకు పోలీసు చట్టాలు, శాంతి భద్రతల పరిరక్షణ, రహదారి, వాహన నిబంధనలు, శిరస్త్రాణం ధరించడం వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి లంక రోజారాణి, ఎంపీటీసీ సభ్యుడు సీహెచ్.బుడ్డు, వార్డు సభ్యులు, ఎస్.గోవిందరావు, పోలీసులు పాల్గొన్నారు.



పశువులు తరలిస్తున్న వాహనం పట్టివేత



పాతపట్నం, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా పశువులను వాహనంలో అక్రమంగా తరలిస్తున్న వ్యాపారిని పోలీసులు అడ్డుకున్నారు. బుధవారం సింగుపురం కూడలి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మెళియాపుట్టి మండలం ఆంపురం నుంచి వాహనంలో ఆరు ఎద్దులను పాతపట్నం మండలం కొదూరు గ్రామానికి చెందిన వ్యక్తి తరలిస్తుండగా వాహనాన్ని పట్టుకొని పోలీసులు కేసు నమోదు చేశారు. పశువులను రణస్థలంలోని గోశాలకు తరలించారు.

గ్రామాల అభివృద్ధికే 'పల్లె పండగ'

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధికే పల్లె పండగ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీపీ సలాన మోహనరావు పేర్కొన్నారు. బుధవారం మండలంలో పరశురాంపురం, మారడికోట, కరజాడ తదితర పంచాయతీల్లో పల్లె పండగ కార్యక్రమం ఉత్సాహంగా చేపట్టారు. ఎంపీడీవో నర్సింహ ప్రసాద్ పండా, ఏపీఎం త్రినాథమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అమరావతి, తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలికంగా మద్యం విక్రయాలు

కోటబొమ్మాళి: నిర్దేశించిన దుకాణాల్లో మద్యం విక్రయాలను తాత్కాలికంగా చేసుకోవచ్చునని కోటబొమ్మాళి ఎక్సైజ్ సీఐ కె.సుజాత అన్నారు. ఈ విక్రయాలకు రెగ్యులర్ లైసెన్సులు మంజూరు చేసే సమయంలో నిబంధనలు కచ్చితంగా పాటించి ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 22 వరకు తాత్కాలికంగా విక్రయాలు చేసుకోవచ్చని వివరించారు. కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, జలుమూరు మండలాల్లో 15 దుకాణాల పరిశీలనలు చేపడుతున్నట్లు తెలిపారు.

పనితీరు మెరుగుపడాలి



పాతపట్నం: పాఠశాల దస్త్రాలు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పాతపట్నం, మెళియాపుట్టి, న్యూస్‌టుడే: గిరిజన ప్రాథమిక, ఆశ్రమ పాఠశాలల నిర్వహణ, పనితీరు మెరుగుపడాలని ఐటీడీఏ సీతంపేట పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి ఉపాధ్యాయులకు తెలిపారు. మండలంలో బైదలాపురం, ఎస్.ఎస్.మనుగు, ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలు, దస్త్రాల నిర్వహణ, భోజన పట్టిక అమలు, పదార్థాల రుచులు, పరిసరాల శుభ్రత తదితర అంశాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మెళియాపుట్టిలోని పెద్దమడి బాలికల ఆశ్రమ పాఠశాలను కూడా పీవో తనిఖీ చేశారు. బాలికలకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, సెలవులకు వెళ్లిన పిల్లలను రప్పించాలని ఉపాధ్యాయులకు తెలిపారు.

నీలమణిదుర్గ హుండీ ఆదాయం రూ.4.78 లక్షలు

పాతపట్నంలోని నీలమణిదుర్గ అమ్మవారి హుండీ ఆదాయం రూ.4,78,133 వచ్చినట్లు దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి టి.వాసుదేవరావు తెలిపారు. ఆలయానికి 15 రోజులుగా వచ్చిన ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. సహాయ కమిషనర్ కార్యాలయ పర్యవేక్షకులు జి.వి.బి.ఎస్.రవికుమార్ పర్యవేక్షణలో లెక్కించినట్లు చెప్పారు. వేంకటేశ్వర సేవా సమితి సభ్యులు, భక్తులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, పాతపట్నం



హెచ్‌సీకి ఎస్పీ పరామర్శ

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో టెక్కలి అయ్యప్పనగర్ కాలనీలో నివాసముంటున్న హెడ్ కానిస్టేబుల్ కె.రవీంద్రరావును ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బుధవారం రాత్రి పరామర్శించారు. విజయవాడలో బందోబస్తు విధులు నిర్వహిస్తుండగా ఆకస్మికంగా అనారోగ్యానికి గురైన విషయాన్ని తెలుసుకున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి విజయవాడ పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి రవీంద్రరావుకు విజయవాడ ఆయుష్ కేర్‌లో మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జి కావడంతో టెక్కలిలో అయ్యప్పనగర్‌లో ఇంటికి చేరుకున్న ఆయనను ఎస్పీ వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

వ్యక్తిపై పలువురి దాడి

కొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని సిరుసువాడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బూరాడ కుమారస్వామి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈయన మంగళవారం రాత్రి వ్యక్తిగత పనిపై ద్విచక్ర వాహనంపై కొత్తూరుకు వచ్చాడు. తిరిగి కొత్తూరు నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో కొత్త కొత్తూరు దాటిన తరువాత మార్గం మధ్యలో అల్లక జయకృష్ణ, డి.తరుణ్, కె.తరుణ్, ప్రభుదాస్, మరో అయిదుగురు కలిసి కుమారస్వామి వాహనాన్ని నిలిపి వ్యక్తిగత దూషణ చేయడంతో ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో కుమారస్వామి గాయపడ్డాడు. కుమారస్వామి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ బి.కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ దాడిపై మరికొన్ని వాదనలు వినిపిస్తున్నాయి. పోలీసులు పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తే వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

ఎట్టకేలకు రహదారికి మోక్షం..!

మెళియాపుట్టి, న్యూస్‌టుడే

గొడ్డ(నేలబొంతు)-ఆంపురం గిరిజన గ్రామాలను కలుపుతూ ఉన్న రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించనుంది. దశాబ్దాలుగా పక్కా రహదారి లేక గిరిజన గ్రామాల వాసులు అవస్థలు పడుతున్నారు. ఆంపురం, పింగువాడ, బంజీరు, రింపి, మూల రింపి, ఎగువ రింపి, అనంతగిరి, ఎగువ అనంతగిరి తో పాటు పాతపట్నం మండలంలో కొనంగి, బడ్డుమర్రి గ్రామాలకు చేరాలంటే దగ్గరి దారి ఇదే. ఆయా గ్రామాల పరిధిలో సుమారు రెండు వేల మంది జనాభా ఉన్నారు.



అనంతగిరి వద్ద అసంపూర్తి కల్వర్టు నిర్మాణం

అసంపూర్తి పనులు.. గొడ్డ-ఆంపురం గ్రామాలకు రహదారి నిర్మించాలని గ్రామస్థులు గత ప్రభుత్వం హయాంలో ప్రత్యక్ష ఆందోళన బాట పట్టారు. 2017-18లో ప్రభుత్వం ఉపాధి హామి పథంలో పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో రూ.1.79 కోట్ల వ్యయంతో రహదారి పనులు మంజూరు చేసినా అసంపూర్తిగానే నిలిచాయి.

నిర్మాణానికి నిధులు మంజూరు

మెళియాపుట్టి మండలం పరిధిలో ఉన్న గొడ్డ-ఆంపురం గ్రామాల మధ్య ప్రధాన రహదారికి కూటమి ప్రభుత్వం మోక్షం కల్పించింది. ప్రధాన మంత్రి జన్‌మన్ పథకంలో భాగంగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తొలి విడతగా సుమారు 2 కిలో మీటర్ల దూరం రింపి గ్రామం వరకు నిర్మాణానికి రూ. 1.92 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి ఈ నెలలోనే టెండర్ ప్రక్రియ కానుంది. త్వరలోనే పనులు చేపట్టి పూర్తి చేయనున్నట్లు తెలిపారు.
– నాగేశ్వరరావు, ఏఈ, పంచాయతీరాజ్ (ప్రాజెక్టు వర్క్స్), మెళియాపుట్టి

సుడి దోమ నివారణపై దృష్టి పెట్టండి

నరసన్నపేట, న్యూస్‌టుడే: వరిపైర్లపై సుడి దోమ ఆశించినట్లయితే తక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి కె.సునీత సూచించారు. తామరాపల్లి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పొలం వద్దకు రైతులతో పాటు వెళ్లి సుడిదోమ నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ఆమె వివరించారు. అలాగే రబీ కాలంలో అవసరమైన విత్తనాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు.



తామరాపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, అధికారులు

తెరపై ఈనాడు

★ కీర్తన: రామ్‌నగర్ బన్నీ ★ కీర్తిక: సత్యం సుందరం ★ కిన్నెర సినీమాక్స్: దేవర ★ ఎస్‌వీసీ (రామలక్ష్మణ): వేట్టయన్ ★ సూర్యమహల్: విశ్వం ★ సరస్వతి: దేవర ★ చంద్రమహల్: జనక అయితే గనక ★ మారుతి: మా నాన్న సూపర్ హీరో – న్యూస్‌టుడే, అరసవల్లి

శ్రీకాకుళం

• శ్రీకాకుళం • ఆమదాలవలస • ఎచ్చెర్ల

కాలువలు శుభ్రం చేయరూ!



పొందూరు మండలం దళ్లవలసలో కాలువల్లో పూడికలు పేరుకుపోయి మురుగునీరు రహదారిపై ప్రవహించడంతో దుర్వాసన వ్యాపిస్తోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రాకపోకలు సాగించేవారు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. కాలువలో పూడికలు తొలగించి శుభ్రం చేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ విస్తరణాధికారి సింహాచలం వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, పొందూరు, పొందూరు గ్రామీణం

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



గార: శాలిహుండం - కొత్తపేటలో రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం గ్రామీణం, గార, బూర్జ, సరుబుజ్జిలి, జి.సిగడాం, పొందూరు, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీలను బలోపేతం చేసేందుకే పల్లె పండగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. శ్రీకాకుళం గ్రామీణ మండలంలోని ఇప్పిలి, కణుగులవానిపేట, గొల్లపేట, కుందువానిపేట, బలివాడ, గార మండలం బోరవానిపేట, శాలిహుండం, పూసర్లపాడు, అంబళ్లవలస, బూరవల్లి గ్రామాల్లో గ్రామాల్లో బుధవారం సీసీ కాలువలు, రహదారుల పనులకు శంకుస్థాపన చేశారు. ❖ గ్రామాల అభివృద్ధితోనే పురోగతి సాధ్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా అన్నపేట, టీడీఆర్‌రాజుపేట, అప్పలపేట పంచాయతీల్లో ఉపాధి నిధులతో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ❖ సరుబుజ్జిలి మండలంలోని గోనెపాడు సర్పంచు బిర్లంగి అమ్మాయమ్మ ఆధ్వర్యంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ❖ కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి చెందుతాయని తెదేపా మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్ అన్నారు. జి.సిగడాం మండల కేంద్రంలో రహదారులను పార్టీనాయకులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ❖ పొందూరు మండలం బురిడికంచరాంలో తెదేపా నాయకుడు వండాన మురళీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.



బూర్జ: టీడీఆర్‌రాజుపేటలో ఎమ్మెల్యే కూన రవికుమార్



సరుబుజ్జిలి: గొనెపాడులో తెదేపా మండల నాయకులు

పల్లెల్లో ఉపాధి బాటలు

ప్రజలకు తీరనున్న దారి కష్టాలు

– న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

వైకాపా పాలనలో గ్రామీణ ప్రాంతాలను నిర్లక్ష్యంగా వదిలేయడంతో అవి అభివృద్ధికి నోచుకోలేదు. ఇప్పటికీ ఎటు చూసినా గుంతల రోడ్లు, మురుగు పేరుకుపోయిన కాలువలే దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం రాకతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి నిధులతో గ్రామాలు కొత్త రూపులు సంతరించుకోనున్నాయి. పంచాయతీ స్థాయిలో నాయకులు గ్రామాల్లో పర్యటించి అక్కడి సమస్యలను స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రభుత్వం నుంచి నిధులు మంజూరై అభివృద్ధి పనులకు అడుగులు పడనున్నాయి.



షళంత్రిలో కాపువీధి రహదారి దుస్థితి

కూలీలు, కార్మికులకు భరోసా..

గత ప్రభుత్వం పాలనలో కూలీలు, భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ఇసుక కొరతతో గ్రామాల్లో గుత్తేదారులు ఎలాంటి అభివృద్ధి పనులు చేసేందుకు ముందుకు రాలేకపోయారు. తాజాగా కూటమి ప్రభుత్వం కార్మికులకు భరోసా కల్పించింది. భవన నిర్మాణ రంగంలో పనులు చేసుకునే వేలాది మందికి పని లభించేలా చర్యలు తీసుకుంది. అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ నెల 20 తర్వాత పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటోంది.

నియోజకవర్గంలో...

మండలం	పనులు	మీటర్లు	నిధులు రూ.లక్షల్లో
సరుబుజ్జిలి	60	6051	376.45
ఆమదాలవలస	96	15,200	883.04
పొందూరు	81	13,742	1449.00
బూర్జ	70	8,021	535.90
మొత్తం	307	43014	3244.39

గ్రామాలకు మహర్దశ

ఆమదాలవలస నియోజకవర్గంలో సరుబుజ్జిలి, ఆమదాలవలస, పొందూరు, బూర్జ మండలాల్లో రోడ్లను సిమ్మెంటు రహదారులుగా మార్చేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి. పనులను పల్లె పండుగ పేరుతో ప్రారంభించి సంక్రాంతి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యం విధించారు.

సకాలంలో పూర్తి చేస్తాం..


"కూటమి ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. డిసెంబరు నెలాఖరుకు పనులు పూర్తిచేస్తాం. –కూర్మనాథరావు, జ్యోతి, పి.వి.ఆర్.గుప్తా, మణికుమార్, సరుబుజ్జిలి, ఆమదాలవలస, పొందూరు, బూర్జ పంచాయతీరాజ్ జేఈలు"

మట్టి రహదారితో అవస్థలు

శ్రీకాకుళం నగరం గుజరాతీపేట తోటవీధిలోని పలు ప్రాంతాల్లో సీసీ రహదారులులేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అధ్వానంగా ఉన్న మట్టి రోడ్లపైనే అవస్థలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు మాట్లాడుతూ నిధుల లభ్యత ఆధారంగా సీసీ రహదారుల నిర్మాణానికి చర్యలు చేపడతామని చెప్పారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం



అంధకారంలో కుద్దిరాం మార్గం



ఆమదాలవలస పురపాలక పరిధిలోని 21వ వార్డు కుద్దిరాం నకు వెళ్లే ప్రధాన రహదారిలో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో చిమ్మచీకట్లు అలుముకున్నాయి. ఈ రహదారిపై నిత్యం విద్యార్థులు, ప్రజలు ఆమదాలవలస, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. పక్కనే రైల్వే ట్రాక్ ఉన్నందున రాత్రి వేళ చీకట్లో ప్రయాణం చేయాలంటే భయపడుతున్నారు. ఈ సమస్యను పురపాలక కమిషనర్ పి.బాలాజీప్రసాద్ వద్ద ప్రస్తావించగా దీపాలు వెలిగే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

శిథిల భయం.. భయం..



ఆమదాలవలస మండలం రామచంద్రాపురం ప్రభుత్వ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో ఏ క్షణంలో కూలిపోతుందోనని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్కన నూతన భవనం నిర్మించినా అటుగా వెళ్లే విద్యార్థులపై రాళ్లు, పెంకులు పడే ప్రమాదం ఉందని వాపోతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి శిథిల భవనాన్ని తొలగించాలని కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎంఈవో రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

గిరిజనులకు బియ్యం పంపిణీ

స్పందనకు వందనం

సరుబుజ్జిలి మండలం చిగురువలస పంచాయతీ బట్టిపేటకు చెందిన గిరిజనులకు బుధవారం రేషన్ బియ్యం పంపిణీ చేశారు. 'అయ్యో.. బియ్యం' శీర్షిక బుధవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై పౌర సరఫరాల శాఖ అధికారి ఎం.సత్యనారాయణ స్పందించారు. ఎండీయూ వాహనం ద్వారా గ్రామానికి బియ్యం తీసుకువెళ్లి 13 మంది లబ్ధిదారులైన గిరిజనులకు బియ్యం అందజేశారు. – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి



పైపులైను సరి చేశారు



శ్రీకాకుళం నగరంలో తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులైను బైరివానిపేటలోని ఓ దాబా వద్ద కొద్ది రోజులుగా మరమ్మతులకు గురైంది. దీంతో తాగునీరు వృథాగా పోతుండటంపై 'ఈనాడు'లో ఈ నెల 14న 'తాగునీరు వృథా' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దానిపై నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు సిబ్బంది పైపులైను మరమ్మతులు చేపట్టారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళంనగరం

అవకాశాలు సద్వినియోగం చేసుకోండి



జెండా ఊపి పోటీలు ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య కె.ఆర్.రజని, అధికారులు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: జాతీయ సేవా పథకంలో వాలంటీర్లు వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమైక్యతా భావాలను పెంపొందించుకొంటూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.ఆర్.రజని అన్నారు. వర్సిటీలో జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో బుధవారం ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనే వాలంటీర్ల ఎంపిక కార్యక్రమాన్ని వీసీ ప్రారంభించారు. ఈ ఎంపికలకు వర్సిటీ దాని అనుబంధ కళాశాలల నుంచి 157 మంది వాలంటీర్లు హాజరుకాగ వీరికి అథ్లెటిక్స్, సాంస్కృతిక, కమ్యూనికేషన్ స్కిల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించి వర్సిటీ స్థాయిలో 12 మందిని ప్రాథమికంగా ఎంపిక చేశారు. వీరికి మళ్లీ జోనల్ స్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇందులో ప్రతిభ కనపరిచిన వారికి దిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనే అవకాశం వస్తుంది. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఎన్ఎస్ఎస్ విభాగం రీజనల్ డైరెక్టర్ ఎం.రామకృష్ణ, వర్సిటీ రిజిస్ట్రార్ పీలా సుజాత, ఎన్ఎస్ఎస్ వర్సిటీ సమన్వయకర్త మురపాన అనురాధ, ఎన్ఎస్ఎస్ పీవోలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: రణస్థలం మండల కేంద్రంలోని సూర్య ఆసుపత్రిలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇడదాసుల విద్యా ఆరోగ్య, శంకర్ ఫౌండేషన్‌లు సంయుక్తంగా బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 110 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 32 మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. వీరికి విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్‌లో ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించనున్నారు. వైద్యులు యశ్వంత్, ఫౌండేషన్ అధ్యక్షుడు ఇడదాసుల తిరుపతిరాజు, బలివాడ శ్రీనివాసరావు, బేతా నర్సింహులు పాల్గొన్నారు.

పంటలపై అవగాహన అవసరం

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: పంటలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారి మెట్ట మోహనరావు అన్నారు. బుధవారం ఆమదాలవలస మండలం చీమలవలస, నెల్లిపర్తి గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చీడపీడలు, దోమలు నివారణకు ఎటువంటి మందులు పిచికారీ చేయాలో రైతులకు వివరించారు. పంటమార్పిడి పద్ధతి ద్వారా అధిక దిగుబడులు సాధించగలరన్నారు. చీమలవలస సర్పంచి సనపల చెల్లంనాయుడుతో పాటు రైతులు, అధికారులు పాల్గొన్నారు.



చీమలవలసలో ఏవో మెట్ట మోహనరావు, రైతులు

ఎన్నాళ్లీ మూగ పాట్లు



ఆమదాలవలస ప్రధాన రహదారిపై సంచరిస్తున్న ఆవులు

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రధాన రహదారిపై రాత్రి పగులు అనే తేడా లేకుండా పదుల సంఖ్యలో మూగజీవాలు సంచరించడంతో ప్రయాణికులు, పాదచారులు, వినియోగదారులు, దుకాణ యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిపై ఎటు చూసినా మూగజీవాలే దర్శనమిస్తున్నాయి. రాత్రి సమయంలో రోడ్డుపై ఆవులు తిష్ఠ వేయడంతో వాహనదారులు ఆ మార్గంలో వెళ్లాలంటే హడలిపోతున్నారు. దుకాణదారులు తమ సామగ్రిని తినేస్తున్నాయని వాపోతున్నారు.

వ్యర్థాలకు అలవాటుపడి..

రహదారిపై పడేసిన వ్యర్థాలను తినేందుకు అలవాటుపడిన మూగజీవాలు అక్కడక్కడే సంచరిస్తున్నాయి. వాటిని విడిచి పెడుతున్న యజమానులపై పురపాలక అధికారులు కనీస చర్యలు తీసుకోవట్లేదని పుర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రహదారులపై మూగజీవాల సంచారం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ప్రధాన రహదారులపై సంచరిస్తున్న మూగజీవాల యజమానులను పిలిపించి వారికి అవగాహన కల్పిస్తాం, వారు వినకపోతే నోటీసులు అందించి తగు చర్యలు తీసుకుంటాం

– పి.బాలాజీప్రసాద్ మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస

నిత్యావసర సరకుల అందజేత



నిత్యవసర సరకులు పంపిణీ చేస్తున్న సేవాసమితి సభ్యులు

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఆమదాలవలస మండలం అక్కులపేట-వేణమ్మపేట సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం అక్కులపేట, శ్రీనివాసాచార్యులపేట పంచాయతీల్లో పేదలకు నెలకు సరిపడిన నిత్యావసర సరకులను పంపిణీ చేసినట్లు సత్యసాయి సేవా సమితి జోనల సమన్వయకర్త ఎం.జానర్దనరావు తెలిపారు. ప్రతి నెలా సేవాసమితి ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్నామని సమితిలో ఉన్న సభ్యులు, భక్తులు సామగ్రిని అందిస్తున్నారన్నారు. సేవాసమితి కన్వీనర్ సూర్యారావు, సభ్యులు పాల్గొన్నారు.

రేపు రాష్ట్ర కార్మిక సదస్సు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ విజయవాడలో గురువారం నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు మల్లేశ్వరరావు కోరారు. సదస్సుకు సంబంధించిన గోడ ప్రతులను కాశీబుగ్గలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను పట్టించుకోవడం లేదని ఆక్షేపించారు. గోపి, భైరాగి, వల్లభరావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఆహారం వృథా చేయడం సరికాదు



కలెక్టరేట్: మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సూర్యచంద్రరావు

కలెక్టరేట్(శ్రీకాకుళం), ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా ఎక్కువ శాతం మంది వ్యవసాయం చేస్తున్నప్పటికీ పెరుగుతున్న జనాభా కారణంగా అందరికీ ఆహారం లభించట్లేదని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.సూర్యచంద్రరావు పేర్కొన్నారు. అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కళాశాలలో బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారాన్ని వృథా చేయడం సరికాదన్నారు. సమావేశంలో అర్థశాస్త్ర విభాగాధిపతి టి.ఆదిలక్ష్మి, అకడమిక్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, ఐక్యూఏసీ సమన్వయకర్త ఎస్.పద్మావతి, చరిత్ర విభాగాధిపతి ఎన్.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు. ❖ పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటామని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ అన్నారు. ఆమదాలవలస మండలం తొగరాం డిగ్రీ కళాశాలలో బుధవారం ఆహార దినోత్సవ కార్యక్రమాన్ని కళాశాల ఆర్థిక విభాగ అధిపతి డాక్టర్ పైడితల్లి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆహార భద్రత, సమతుల్యం యొక్క విశిష్టతను వివరించారు. ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యంతో 2030కి ఆకలి అంతమొందించడమే లక్ష్యంగా పెట్టుకుందని ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. తొగరాం ప్రభుత్వ వైద్యాధికారి పి.శ్రీనివాసరావు, సమన్వయకర్త వై. రమణమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ

ఎత్తిపోతల పథక నిర్మాణానికి క్షేత్ర పరిశీలన

బూర్జ, న్యూస్‌టుడే :మండలంలోని అల్లెన వద్ద నాగావళి నుంచి ఎత్తిపోతల పథక నిర్మాణాన్ని చేపట్టి సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరు అందించే విధంగా స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ కృషి చేస్తున్నారని పార్టీ మండల అధ్యక్షుడు వావిపల్లి సీతారాంబాబు(రాంజీ) తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాలతో బుధవారం సంబంధిత అధికారులు అల్లెన పరిసరాల్లో క్షేత్ర పరిశీలన చేపట్టినట్లు తెలిపారు. అల్లెన, లక్కుపురం, పాలవలస, ఏటొడ్డుపర్త, తదితర గ్రామాల రెవెన్యూ భూములకు పుష్కలంగా సాగునీరు అందనుందన్నారు. డీఈ కామరాజు, ఏఈ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, రైతులు, తదితరులు ఉన్నారు.

గొర్రెల సంరక్షణకు జాగ్రత్తలు పాటించాలి

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: గొర్రెల పెంపకందారులు వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించాలని పురుషోత్తపురం పశువైద్యాధికారి డి.సంతోష్‌కుమార్ అన్నారు. సామూహిక నట్టల నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎల్‌పీఎం అగ్రహారంలో బుధవారం 391 గొర్రెలు, మేకలకు నివారణ మందు వేసినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో గొర్రెలు, మేకలకు వ్యాధులు సోకుతుంటాయన్నారు. వాటిని గమనించి సకాలంలో వైద్యం చేయించుకుంటే గొర్రెలను కాపాడుకోవచ్చునన్నారు. ఈ నెల 30 వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సర్పంచు ప్రతినిధి నందివాడ గోవిందరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారాన్ని తీసుకోండి..

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు అధికారిణి శోభారాణి అన్నారు. శ్రీకాకుళం నగరంలోని సీడీపీవో కార్యాలయ ఆవరణలో బుధవారం ఐదు సెక్టార్ల పరిధిలోని పర్యవేక్షకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలను గుర్తించాలని సూచించారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు యశోద, తదితరులు పాల్గొన్నారు.

ఇలాగైతే ప్రమాదాలు జరగవా?

ఆమదాలవలస నుంచి పలు గ్రామాలకు బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. అయితే ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకువెళ్తుండటంతో చిన్నాపాటి నిర్లక్ష్యం జరిగినా ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. అసలే గుంతలతో నిండిన రోడ్లు కావడంతో ప్రమాద తీవ్రత ఊహించలేం. అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారని పలువురు కోరుతున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కఠిన చర్యలు చేపడతామని ఎస్సై వెంకటేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస



మొండి గోడలకే పరిమితం



జి.సిగడాం మండలం జాడ గ్రామ సమీపంలో పేదలకు అందించిన జగనన్న కాలనీలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోవడంతో మొండి గోడలే దర్శనమిస్తున్నాయి. కాలనీలో తాగునీరు, విద్యుత్తు, రహదారులు సరైన సౌకర్యాలు లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ముందుకు రాలేదు. దీంతో కాలనీలో నిర్మాణాలు సగంలో నిలుపుదల చేశారు. అక్కడ కనీస సౌకర్యాలు కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో రామకృష్ణని వివరణ కోరగా.. కాలనీలో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, జి.సిగడాం

ముమ్మరంగా అభివృద్ధి పనులు

శ్రీకాకుళం రోడ్డు ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో వివిధ అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అమృతభారత్ రైల్వేస్టేషన్లో భాగంగా శ్రీకాకుళంరోడ్డు రైల్వేనిలయం అభివృద్ధికి నిధులు మంజూరు చేయడంతో పనులు సాగుతున్నాయి. ప్లాట్‌ఫాం, మరుగుదొడ్లు, ప్రయాణికుల వసతి గృహాలు, టికెట్ కేంద్రాలు, కాలినడక వంతెనలు, ఎస్కలేటర్లు తదితర నిర్మాణాలను చేపడతున్నారు. అత్యాధునిక వసతులతో కూడిన రైల్వేస్టేషన్‌గా కొన్ని నెలల్లో దీన్ని మారుస్తామని స్టేషన్ మేనేజర్ ఎం.రవి తెలిపారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం



అన్నసమారాధన



జి.సిగడాం మండలం పెంట గ్రామంలో వెలసిన అప్పమ్మ పేరంటాల ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం గ్రామస్థులు అమ్మవారిని మహిళలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో గ్రామంతోపాటు పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, జి.సిగడాం

కూరగాయల ధరలు

శ్రీకాకుళం రైతుబజారులో కూరగాయల నిన్నటి ధరలు (కిలో రూపాయల్లో): • టమాటాలు 58 • వంకాయలు 44/50 • బెండ 22 • బీర 40 • కాకర 40 • దొండ 34 • క్యాబేజీ బుట్ట 34 • గోల్కొండ చిక్కుడు 36 • క్యారెట్ 46/50 • బీట్‌రూట్ 40 • ఉల్లిపాయలు 40/55 • బంగాళదుంపలు 34 – న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)